
# శాంతి

# SANTI

విశ్వమానవ సౌభ్రాతృత్వ సందేశము గల ఆధ్యాత్మిక మాసపత్రిక

ఏప్రిల్ -2023

ప్రణవోధనుః శరోహ్యాత్మా బ్రహ్మతల్లక్ష్యముచ్యతే
అప్రమత్తేన వేద్ధవ్యం శరవత్ తన్మయోభవేత్



పరమపూజ్య శ్రీ స్వామి ఓంకార్ మహారాజ్

జననం : 1895 మరణం : 1982

## లోకశాంతి ప్రార్థన

(వ్యక్తి శాంతికి - విశ్వశాంతికి)

పూజనీయమైన ఓ దివ్య స్వరూపా!
మా లోపలను వెలుపలను మీదను క్రిందను అంతటను
నిండియున్న ఓ సర్వాంతర్యామి! మా లోపల ప్రత్యణువు
నందును ఇమిడి యుండి మా నేత్రములకు నేత్రము,
కర్ణములకు కర్ణము, హృదయములకు హృదయము,
మనస్సులకు మనస్సు, శ్వాసలకు శ్వాస, ప్రాణములకు ప్రాణము,
ఆత్మలకు ఆత్మవై వెలుగొందు ఓ దేవా! ప్రేమైక మూర్తీ !
నిన్ను తెలుసుకొను భాగ్యము ఇప్పుడు ఇచ్చటనే మాకు ప్రసాదింపుము.
ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల
ఉత్తర దక్షిణముల, ఈ విశ్వము నందంతటను అందరును
నీ దివ్య తేజస్సును గ్రహింతురు గాక!
ఓ సచ్చిదానంద స్వరూపా !
ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యమునను
శాంతి సామరస్యములను ప్రతిష్ఠింపజేయుము.
ఓ దేవా! ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఏకం సత్ విప్రా బహుదా వదంతి
ఒకే సత్యము అనేక విధములుగా బ్రహ్మజ్ఞులచే చెప్పబడినది.

- ఋగ్వేద సంహిత

# శాంతి

# SANTI


**విశ్వమానవ సౌభ్రాతృత్వ శాంతి సందేశ ఆధ్యాత్మిక మాసపత్రిక**

**స్థాపకులు : పరమపూజ్య శ్రీస్వామి ఓంకార్‌జీ మహరాజ్**

**సంపాదకులు : స్వామిని వినమ్రానంద**

**సంపుటి : 99** ఏప్రిల్ **-2023** సంచిక : **4**


| వ.నెం. | విషయసూచిక | పేజి నెం. |
|---|---|---|

| 1. | ప్రార్థన - నిరఞ్జనాష్టకమ్ (శ్రీ శంకరాచార్య విరచిత) | 2 |
| 2. | ధ్యానము - శ్రీ శంకరాచార్యవిరచిత కాశీపంచకము | 2 |
| 3. | శ్రీ ఓంకార్ ఆత్మకథ - అనువాదం : బొప్పన అరుణాదేవి | 3 |
| 4. | గురువాచకకోవై - మురుగనార్ | 9 |
| 5. | భస్మాసురహస్తము - భారతి | 11 |
| 6. | తత్వమసి - శ్రీ తెన్నేటి విశ్వనాథం | 15 |
| 7. | తులసీ సర్వస్వము- శ్రీ జి.వి.యస్. సుబ్రహ్మణ్యం | 20 |
| 8. | వార్తలు - కార్యక్రమములు | 25 |
| 9. | విరాళములు | 27 |



**ఈ పత్రికలో ప్రచురింపబడిన వ్యాసముల యొక్క భావాలకు రచయిత్రి / రచయితలే బాధ్యులుకాని, సంపాదకులు కారు.**

**జీతం సభ్యత్వం రూ. 1000/- లు సాలుసరి రూ. 100/-**




# ప్రార్థన

**శ్రీ శంకరాచార్యకృత నిరఞ్జనాష్టకమ్**

శ్లో॥ వేదో న శాస్త్రం చ శౌచ సన్ధ్యే,
మన్త్రో న జాప్యం చ ధాన-ధేయమ్ ।
హోమో న యజ్ఞో న చ దేవపూజా,
తస్మై నమో బ్రహ్మనిరఞ్జనాయ ॥

వేదశాస్త్రములు గాక, శౌచ సంధ్యలు గాక, మంత్ర జపములు గాక ఆధార ఆధేయములు గాక, హోమ యజ్ఞములుగాక, దేవపూజయును గాక ఒప్పుచుండెడు నిరంజనబ్రహ్మమునకు నమస్కారము.

# ధ్యానము

**శ్రీ శంకరాచార్యకృత కాశీపంచకమ్**

**శ్లో॥ యస్యా మిదం కల్పిత మింద్రజాలం
చరాచరం భాతి మనోవిలాసమ్ ।
సచ్చిత్సుఖైకా పరమాత్మ రూపా
సా కాశికాఽ హం నిజబోధరూపా॥ 2**

ఏ వస్తువునందు ఇంద్రజాలమువలె, మనో విజృంభణ మాత్రమైన భ్రాంతిచే కల్పితమైన, ఈ చరాచరాత్మక ద్వైత ప్రపంచమంతయు భాసించుచున్నదో, సచ్చిదానందాత్మకమైన - అద్వితీయమై పరమాత్మ స్వరూపమైన ఆ వస్తువు ఆత్మజ్ఞానమే అదియే కాశీక్షేత్రము. అట్టి కాశీ స్వరూపుడను నేనే.

శాంతి కావలసిన యెడల అది ఎచ్చటనో లేదు. అది మనలోనే యున్నది. మనలోని శాంతిని అనుభవించినపుడే, ఇతరులకు శాంతిప్రదానము చేయగలము.

**స్వామి ఓంకార్.**

మీరు మీలోని సత్యాత్మతో, మీలోని దివ్యశక్తితో ఏకీభవించి జీవించినట్లయితే, మీలోని పరమాత్మ సంబంధాన్ని, మీ స్వరూపమయిన పరబ్రహ్మ యొక్క అడుగు జాడలను మీరు అతిక్రమించనట్లయితే నిరంతరం దైవప్రేరితులై, ఆనందమయులై జీవించగలరు.

**స్వామి రామతీర్థ**

# శాంతి ప్రదాత శ్రీ ఓంకార్ స్వామిజీ ఆత్మకథ

**మూలం : స్వామిఓంకార్** **అనువాదం : బొప్పన అరుణాదేవి**

## అధ్యాయం - 42

## మళ్ళీ ఒళ్ళంతా కట్లు

## శాంతి పత్రిక, మార్చి - ఏప్రిల్, 1936 ఆశ్రమ వార్తలు

పూజ్య స్వామీజీ మళ్ళీ అమెరికా వెళ్ళేముందు ఆయన స్నేహితులయిన వైద్యులు తుంటి ఎముకకి ఒకసారి ఎక్స్‌రే తీయించుకోవాల్సిందిగా సలహా ఇచ్చారు. క్రితం పర్యాయం అమెరికా వెళ్ళినప్పుడు జారి పడిపోయినప్పుడు స్వామీజీ తుంటి ఎముక విరగటం వలన, అది మళ్ళీ ఇబ్బంది పెట్టడం మొదలయింది. ఎక్స్‌రేలో వారి తుంటి ఎముక సరిగ్గా అతుక్కోలేదని తేలింది. డాక్టరు కిని, డాక్టరు రావు గార్లు స్వామీజీకి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం ఆపరేషన్ చేయాలని నిర్ణయించారు. తుంటి నుండి ఎముక పూర్తిగా పక్కకి తొలగిపోయినా కేవలం కండరాల సహాయంతో స్వామీజీ సంతోషంగా ఎలా పరిగెత్త గల్గుతున్నారా అని ఆ డాక్టర్లు ఆశ్చర్యపడ్డారు.

స్వామీజీకి ఆపరేషన్ చేయాలి అనే వార్త విని మేమందరము తీవ్రమయిన విచారంలో మునిగిపోయాము. మన ప్రియతమ పూజ్య స్వామీజీ, తన అసాధారణ మయిన వేదాంత ధోరణిలోనే ప్రవర్తించేవారు. వారు వ్రాసిన వ్యాసము విశ్రాంతిలో మనకు వారి అనుభవాలను సవివరంగా తెలియచేస్తాయి. ఆపరేషన్ తర్వాత వైద్యశాలలో వారి అనుభవాలు అందులో పొందుపర్చబడ్డాయి. సోదరి సుశీలాదేవికి ధన్యవాదాలు. వాటన్నింటిని అతి జాగ్రత్తగా సేకరించినందులకు అంతేకాక ఆమె స్వామీజీకి ఎన్నో సేవలందించారు. అతి జాగ్రత్తగా, ఎంతో ప్రేమతో ఆమె స్వామీజీకి అందించిన సేవల వలన వారు త్వరగా కోలుకున్నారు.

ఆ సర్వేశ్వరుడు స్వామీజీ కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిపించేందుకు మంచి సామర్థ్యము గల ఉత్తముడైన వైద్యుడు కిని గారిని అతని అనుయాయులను ఎంచు కున్నాడని మేమందరము భావిస్తున్నాము. దానివలన స్వామీజీ స్వేచ్ఛగా, స్వతంత్రంగా నిశ్చింతగా తమ శాంతి కార్యక్రమాలను నిర్వహించగల్గుతారు. స్వామీజీ స్నేహితులు, ఆయనను పూజించేవారు. ఆరాధించేవారు, భక్తులు, తూర్పు పడమర దేశాల్లోని వారి అనుయాయులు అందరూ కూడా వారి ఆరోగ్యం కోసం మాతో కలిసి ప్రార్థనలు చేయాలని కోరుకుంటున్నాము.



## మన పూజ్య స్వామీజీ

భగవంతుని అనుగ్రహం వలన నా అదృష్టం చేత నేను సురక్షితంగా ప్రత్యేకమయిన విభాగంలోనికి తీసుకురాబడ్డాను. విశాఖపట్టణంలోని కింగ్‌జార్జి వైద్యశాలలోని మా కోసం కేటాయించబడిన ప్రత్యేకమయిన గదిలో విశ్రాంతి తీసుకుంటూ అనంతమయిన శాంతిని పొందటం నా అదృష్టదేవత ప్రసాదించిన ఆశీర్వచనం. స్వర్గలోకపు దేవతలు నా మీద బంగారు కిరణాలతో అనుగ్రహ వర్షాన్ని రోజు రోజుకి గుమ్మరిస్తున్నట్లుగా నేను అనుభూతి చెందాను. మంచం మీద పడుకొన్నా పక్కనే ఉన్న కిటికీలో నుండి బయటి ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూ తల్లి ఒడిలో పడుకున్నంత ప్రశాంతంగా కాలం గడిపేవాడిని. చాలా పెద్ద కిటికీలో నుండి విశాలమయి వినీలాకాశం, బారులు తీరిన కొండల వరసలు, పెద్ద పెద్ద వృక్షాలు, పచ్చని పొదరిళ్ళు కంటికి ఆహ్లాదాన్ని కలిగించేవి. సూర్యోదయం కాగానే సూర్య భగవానుని లేలేత బంగారు కిరణాలు నవ్వుతూ నా మంచం మీదుగా నాట్యం చేస్తున్నట్టుగా పరుచుకునేవి. సూర్యాస్తమయ సమయంలో కొండల్లోకి సూర్యుడు దిగిపోవడం చూస్తూ గడిపేవాడిని. దగ్గరలోనే ఉన్న సముద్రపు అలలు ప్రతినిత్యం 'ఓంకారాన్ని' జపిస్తుండేవి. సముద్రము మీద నుండి వీచే పిల్లగాలుల్లో నిండిన ఉప్పు వాసన చల్లని మలయమారుతంలా నన్ను పలకరిస్తూ ఉండేది. నాకు వైద్య సేవలు అందించిన ఎందరో నిపుణులైన మంచి వైద్యులు. నిస్వార్థంగా సేవలు చేసిన నర్సులు, వాని ప్రేమానురాగాలు, మంచితనము, దయాగుణము, శ్రద్ధ తల్చుకొని నా హృదయం వారి పట్ల ఎంతో కృతజ్ఞతాభావంతో నిండిపోయింది.

నాలుగు రోజులు అన్నివిధాలయిన పరీక్షలు చేసిన అనంతరము మార్చినెల 5వ తేదీన నన్ను ఆపరేషన్ థియేటర్‌లోనికి తీసుకువెళ్ళి మత్తు మందు ఇచ్చారు. అప్పుడు నేను ప్రశాంతంగా శ్వాస తీసుకొని వదులుతూ ప్రాణాయామ క్రియలు చేశాను. నెమ్మదిగా మత్తు నన్ను ఆవరిస్తుండగా నా ఆలోచనలు దివ్యజ్యోతి స్వరూపం మీద స్థిరంగా నిలిపి అందులో నన్ను నేను విలీనం చేయడానికి ప్రయత్నించాను.

నేను నెమ్మదిగా కళ్ళు విప్పే సమయానికి నేనింకా ఆ దివ్యానుభూతిలో ఉండిపోయాను. సుశీలాదేవి, నా జీవితానికి గొప్ప వరంగా శాంతి ఆశ్రమానికి వరంగా అనుగ్రహింపబడిన తల్లి, నెమ్మదిగా నా మీదకి వంగి నవ్వుతూ నా ఆపరేషన్ విజయవంతంగా జరిగినందుకు నాకు శుభాకాంక్షలు తెలియచేసింది. దాదాపు 45 నిముషాలు నేను మత్తులో ఉన్నట్లు తెలిసింది. చాలా పెద్ద గాటు పెట్టి ఎముకను రంపముతో కోసి మళ్ళీ తుంటి ఎముకకి అతికించారు. తుంటి భాగము నుండి కాలి బొటనవేలి వరకు సిమెంటు కట్టు వేశారు. ఆ విధంగా భయంకరమయిన, భయాన్ని కలిగించే ఆపరేషన్ చాలా విజయవంతంగా ముగిసింది. కట్లతో ఇప్పుడు

ఇక్కడ నేను ఒక క్రొత్త అవతారం దాల్చినట్లుగా ఉంది. తాబేలు తన అవయవాలను చిప్పలో దాచుకున్నట్లుగా ఉంది నా పరిస్థితి. అయినా నేను తూర్పు, పడమరల్లోని శాంతిసభ్యులు, స్నేహితులు, సన్నిహితులు, భక్తులు, సాధకులు, శాంతి పత్రికను ఎంతో ప్రేమాభిమానాలతో చదివే పాఠకులతో నా సంతోషాన్ని, ఆనందాన్ని, శాంతిని పంచుకుంటున్నాను. ఈ విధంగా పన్నెండు రోజులు ప్రశాంతంగా గడిచిపోయాయి. నేను చెపితే బహుశా మీరు నమ్మకపోవచ్చు గాని ఈ దినాల్లో నేను నా శరీరంలో ఆపరేషన్ వలన కలిగిన గాయపు బాధ గాని లేకుండా కుట్లు వలన ఎముకకు అతకడం వలన కలిగే బాధ గాని లేకుండా అలాంటి సమయంలోగాని ఏ విధమయిన ఆందోళన లేకుండా ఎంతో ప్రశాంతంగా కాలం గడిపాను. భగవంతుడు మనతోనే ఉన్నప్పుడు మనకు ఎలాంటి ఇబ్బంది, వ్యతిరేకత ఉండదు కదా! అంతా ఆ పరమాత్మ దివ్యానుగ్రహమే అని భావించి సంతోషంగా ఉన్నాను.

నిజమయిన బాధ ఏదయినా ఉంటుంది అంటే అది నా వరకూ కేవలం ప్రియాతి ప్రియతముడు హృదయేశ్వరుడు, విశ్వాన్ని అంతటిని నియంత్రించే నియంత అయిన సర్వేశ్వరుడినుండి ఎడబాటు మాత్రమే అవుతుంది. పరమాత్మను మర్చిపోవటము, నిర్లక్ష్యం చేయటం, ఆత్మ స్వరూపాన్ని జీవిత పరమార్థాన్ని వదలుకోవటాన్ని మించిన వేదన మానవునికి ఇంకేముంటుంది? ఇతరమయిన చిన్న చిన్న బాధలు, వేదనలు, మరణము వంటి సంవేదన పరమాత్మ ఐక్య అనుభూతి నుండి, సత్యం నుండి దూరము కావటం కన్నా గొప్ప బాధ కాదు కదా! మిగిలినవన్నీ గాలికి కదిలిపోయే మేఘాల వంటివి.

ఏదయినా అసౌకర్యం ఉంది అంటే అది కేవలం ఆ వైద్యశాలలోని ఇతర రోగుల బాధలను చూచినప్పుడు ఏర్పడినదే అని చెప్పవచ్చును. వారిలో కొందరు చాలా భయంకరమయిన బాధలను, ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నిజంగా ఇక్కడి వైద్యులు ఎంతో సహృదయులు, ఆధ్యాత్మిక చింతన కలవారు కూడా కావటం వలన అద్భుతమయిన సేవల అందిస్తూ రోగులకు ఉపశాంతి కల్గిస్తున్నారు. వారందరూ రాత్రి పగలు తేడా లేకుండా నిరంతరము, నిస్వార్థంగా ఆ పరమాత్మనే సేవిస్తున్నారు. అక్కడి మూగవారు, గుడ్డివారు, బలహీనులు, దుర్బలులు అయిన రోగుల సేవలో వారు తరిస్తున్నారు.

నా చుట్టూ ఉన్న మానవాళి పడుతున్న కష్టాలు, భౌతికమయిన బాధలు గమనించిన తర్వాత, ఇక్కడి వైద్యశాలలో వారికి వెంటనే అందుతున్న సేవలు, వైద్యము గమనించిన తర్వాత 'వైద్యో నారాయణ హరిః' అన్నట్లుగా ప్రాణదాతలు అయిన, నిస్వార్థపూరిత సేవలందించే వారు నిజంగా దేవతలుగా అనిపించారు. వారి ముందు నేను ఎంత అనిపించసాగింది. వారు వైద్యవృత్తి నిపుణులు,



విరిగిపోయిన ఎముకలను ఎంతో నైపుణ్యంతో అతికించగల్గిన సర్జన్లు. దానికి ఎంతో కృషి, పట్టుదల, దీక్ష, తెలివితేటలు, దక్షత అవసరమవుతుంది. ఎంతో అంకిత భావంతో వైద్యులు అందించే సేవల ద్వారా వారు భగవంతుని చేతిలో చక్కని పనిముట్లుగా తయారవుతున్నారు. పరమాత్మ తన లీలలను, అనుగ్రహాన్ని, ఆశీస్సులను వైద్యుల ద్వారా అందిస్తున్నాడు అన్నది సత్యము కాదా!

అజ్ఞానం నుండి విడుదల పొందటం అనేది అపురూపమయిన అనుగ్రహించబడిన క్షణాలు. బంధనము అనేది కేవలము శరీరంపైనున్న సిమెంటు కట్టు మాత్రమే కాదు. మన భౌతిక శరీరమే తన తొడుగు లాంటిది. కేవలము కొద్దిమంది అరుదయిన ఆత్మస్వరూపాలు మాత్రమే అన్ని బంధనాల నుండి, తొడుగుల నుండి విముక్తులు కాగలుగుతారు. అది మాటల్లో వర్ణించలేని అద్భుతమయిన అనుభవము, స్వేచ్ఛ, ఆరోగ్యం అన్ని బంధనాల నుండి విముక్తి పొందిన తేజమూర్తులకే లభిస్తుంది.

'బంధనము' అనే పదము వినగానే దానివలన కలిగే అనేక విధాలయిన ఇబ్బందులు, కష్టాలు గుర్తుకువస్తాయి. నిజానికి మనము ఒంటి నిండా కట్లతో మంచానికి కొంతకాలము పరిమితమయిన వాళ్ళను చూచి జాలి పడాల్సిన పని లేదు. వారి కంటె కట్టుబాట్లు, కులము అనే బంధనానికి బానిసలయిపోయిన వాళ్ళ మీద ఎక్కువగా జాలిపడాల్సి ఉంటుంది. వీరు ఆత్మజ్ఞానానికి కన్నా సాంఘిక కట్టుబాట్లకి, ఆచార సంప్రదాయాలకి, జాతి, మతము, కులము మొదలైన వాటికి ఎక్కువ ప్రాధాన్యమునిస్తారు. అవే వారిని బంధనంలో చిక్కుకుని బాధపడేలా చేస్తాయి. అందువలన అలాంటి బంధనాల నుండి విముక్తి పొందటానికి ప్రయత్నించాలి. పరిస్థితులకు లొంగిపోయి ఆత్మనూన్యతకు ఎవ్వరూ గురికాకూడదు. విధివశాత్తూ ఇబ్బందులు ఏర్పడినా, శరీరానికి గాయం ఏర్పడి ఎముకలు విరిగి, రక్తమాంసము కారి కట్టుకట్టుకోవాల్సి వచ్చినా దాని గురించి బాధపడాల్సిన పనిలేదు. అదంతా తాత్కాలికమే. నెమ్మదిగా అవన్నీ మానిపోతాయి.

ఈరోజు నన్ను చక్రాల కుర్చీలో కూర్చోబెట్టుకుని మళ్ళీ ఆపరేషన్ థియేటర్ లోనికి తీసుకువెళ్ళారు. దయామయుడయిన వైద్యుడు నా తుంటి ఎముకకి ఆపరేషన్ చేసిన చోట ఎక్కడ కుట్లు వేశారో అక్కడ బెజ్జం పెట్టి పరీక్షించాడు. గాయం పూర్తిగా మానిపోయింది. అందువలన తొందరలోనే కుట్లు కూడా తీసివేశారు. తర్వాత నన్ను ఎక్స్‌రే గదిలోనికి చక్రాల కుర్చీలోనే తీసుకువెళ్ళి కొత్తగా అతికిన తుంటి ఎముక సరిగ్గా ఉందో లేదోనని పరీక్షించడానికి ఎక్స్‌రే తీశారు. మాకు ఎంతో సంతోషాన్ని కలుగజేస్తూ శుభవార్త తొందరగానే వచ్చింది. ప్రేమమూర్తి, మంచి భక్తిపరుడు,

రేడియాలజిస్టు, ఎక్స్‌రే డిపార్టుమెంట్ అధిపతి నా తుంటి ఎముక చాలా బాగా అతుక్కుందని ప్రకటించాడు. ఆపరేషన్ చేసిన సర్జను ఏదయితే కోరుకున్నాడో అది నెరవేరింది. డాక్టరుగారు చాలా సంతోషించారు. అలాగే సుశీలాదేవి ఆనందానికి అవధులు లేవు. ఆమె కలలు, ఆశలు అన్నీ సాకారము అయ్యేందుకు అవకాశము ఏర్పడినందుకు దివ్యానందంలో మునిగిపోయింది. నేను అలాగే పడుకుని కళ్ళలో ఆనందబాష్పాలతో చూస్తుండిపోయాను. నా హృదయం కృతజ్ఞతాభావంతో నిండి పోయింది. ఆపరేషన్ జరిగినప్పుడు, కుట్లు విప్పినప్పుడు, బాధలు అనుభవించినప్పుడు నా కళ్ళలో నీరు రాలేదు కాని ఇప్పుడు ఆపరేషన్ విజయవంతమయింది అనే వార్త విన్నప్పుడు ఆ పరమాత్మ స్వరూపుడి దివ్యానుగ్రహాన్ని తలుచుకొని కృతజ్ఞతతో నా కళ్ళలో నీరు తిరిగింది. నా హృదయం అరిచి పెద్దగా చెపుతోంది ఆ భగవంతుని అనుగ్రహాన్ని తలుచుకొని. వైద్యుడు ప్రకాశవంతమయిన నవ్వు ముఖంతో నా వద్దకు సంతృప్తిగా వచ్చి చెప్పినప్పుడు నేను నెమ్మదిగా మృదువుగా "నా హృదయపూర్వక ధన్యవాదాలు మరియు మీకు శుభాకాంక్షలు" అని చెప్పాను. ఆయన మాత్రం దానికి పెద్దగా స్పందించలేదు, ఎంతో వినయంగా, ప్రశాంతంగా నవ్వుతూ "అంతా దైవానుగ్రహము" అన్నాడు.

ఇక ఇప్పుడు నన్ను ప్రత్యేకమయిన వార్డులోనికి మార్చారు. తిరిగి నేను ప్రశాంతంగా నాపవిత్రమయిన దేవాలయములో ఉన్నట్లుగా, ఆనందంగా, ఆహ్లాదంగా చల్లని సముద్రపు గాలులను ఆస్వాదిస్తూ, జీవ ప్రదాత అయిన సూర్య భగవానుడి ప్రకాశవంతమయిన సూర్యకిరణాలలో తడుస్తూ కాలం గడపసాగాను. ప్రతిరోజు నా మంచంపై పడుకుని సూర్యాస్తమయాన్ని తిలకిస్తూ మెత్తని పరుపును గులాబీల మంచంగా భావిస్తూ ఉండేవాడిని. సూర్యుడు బంగారు రంగులో మెరుస్తున్న బంతిలాగా ఊదారంగు కొండల్లోకి దిగిపోవటం చూస్తూ అంతులేని ప్రశాంతతను అనుభవించేవాడిని.

ఆపరేషన్ చేసిన వైద్యుడు నా వద్దకు వచ్చి "స్వామీజీ! నాకు మీ గురించి ఎంతో గర్వంగా ఉంది. నా కర్తవ్యాన్ని నేను విజయవంతంగా ముగించాను. ఇక ఇప్పుడు మీ వంతు వచ్చింది. ఇంకొక నెలరోజులు మీరు ఈ సిమెంటు కట్టుతో ఉండాలి. తర్వాత అరవైరోజులు చాలా జాగ్రత్తగా కదలకుండా ఉండాల్సి ఉంటుంది" అని చెప్పాడు. అందువలన నేను వెల్లకిలా పడుకోవాల్సి వచ్చేది. కనీసం కుడివైపుకు గాని లేదా ఎడమ వైపుకు గాని తిరిగి పడుకోవాలి అనికలలో కూడా అనుకోలేదు.

ఇప్పుడు నాకు చాలా సమయం విశ్రాంతి దొరకటం వలన నేను నా మనస్సు



లోతుల్లో మెదలుతున్న ఆలోచనా తరంగాలను, నా హృదయంలో కదులుతున్న ప్రేమ తరంగాలను, ప్రశాంతతను నా ప్రియమైన స్నేహితులకు, తూర్పు పడమర ఉత్తర దక్షిణ ప్రాంతాల్లోని వారందరితో పంచుకోవాలనుకుంటున్నాను. శాంతి పత్రిక పాఠకులారా! నా చేతులు చాచి మీ హృదయాలను స్పృశిస్తూ చెప్పాలనుకుంటున్నాను. "శాంతి అనేది మీ హృదయాంతరాళాల్లోనే ఉంది" మీ దేశానికి సేవలందించండి. ప్రపంచ మానవాళికందరికి శ్రేయస్సు చేకూర్చండి, భగవంతుని దివ్యానుభూతిని ఇప్పుడు, ఎప్పుడూ ఎల్లప్పుడూ కూడా అనుభూతి చెందండి.

కొన్నివేలమంది, కాదు మిలియన్ల కొద్ది వ్యాధిగ్రస్తులు అనేక వైద్యశాలల్లో ఎన్నో బాధలను అనుభవిస్తూ ఉన్నారు. వారందరి ఉపశాంతి కోసం మీరు ప్రార్ధనలు చేయండి. వారికి మీ ప్రేమను మీ నిశ్శబ్దమయిన ప్రార్ధనల ద్వారా అందించండి. వారందరూ త్వరగా కోలుకొని ఆరోగ్యవంతులు కావాలని భగవంతుని ప్రార్థించండి. పడిపోయిన వారిని ఉద్ధరించడం కోసం, పేదరికంతో బాధపడుతున్నవారి కోసం ప్రపంచంలోని వారందరికి శాంతి సౌభాగ్యాలను ప్రసాదించమని, తద్వారా ఈ భూమిపై శాంతి నెలకొనాలని, దేశాల మధ్య సౌభ్రాతృత్వం పెంపొందాలని ప్రార్థించండి.

డా॥ విలియన్ డేనియల్ గారికి ధన్యవాదాలు తెలియచేసుకుంటున్నాను. నన్నూ, సుశీలాదేవిని అమెరికా దేశానికి ఆహ్వానించి, అందుకు అవసరమయిన ఏర్పాట్లు చేసినందులకు, తొందరలోనే నేను అమెరికా దేశంలో ఉంటాను. అప్పుడు నేను చక్కగా, స్థిరంగా నా కాళ్ళపై నేను నిలబడగల్గుతాను, నడవగల్గుతాను, నా ప్రేమను, శాంతి సందేశాలను శాంతి ప్రేమికులతో పంచుకోవాలని నా మనస్సు ఉవ్విళ్ళూరుతుంది.

సోమరితనాన్ని అన్ని విధాలా తొలగించుకోవాలి. ఎప్పుడూ కార్యపరత్వం అంటే ప్రతిఘటనే, శారీరక, మానసికమైన అన్ని దౌష్ట్యాలను ఎదుర్కో. ఈ ప్రతిఘటనలో నీవు సఫలతను పొందినపుడే నీకు శాంతి కలుగుతుంది.

**స్వామి వివేకానంద.**

కుండ నిండుచుండునపుడు బుడబుడమని ధ్వని వినబడును. నిండగానే శబ్దము శాంతించును. అట్లే ఈశ్వరప్రాప్తి కలుగకుండునంత వరకు దేవుని విషయమై మనుష్యుడు 'లొడలొడ' వ్యర్థవాదముల విశేషముగా చేయుచుండును. ఇక భగవత్సాక్షాత్కారము పొందినవాడు ప్రశాంతముగా బ్రహ్మానందము ననుభవించుచుండును.

**శ్రీరామకృష్ణ పరమహంస**

# గురువాచక కోవై

**మూలం : మురుగనార్** **వివరణ : సాయికృష్ణ**

**(గత సంచిక తరువాయి)**

## బ్రహ్మైక్యము నందలి జ్ఞానానుభవము

**భగవచ్చరణముల యందు శరణుజొచ్చిన మనస్సుతో, హృదయమున ఉప్పొంగిన భక్తితో తపస్సు చేయబూనుకొన్నవాడా! శక్తులనిచ్చెడి సిద్ధులపై గల వ్యామోహమును పూర్తిగా నశింపజేసికొని, సదా శివాత్మకమగు మోక్షానందమును పొందుము.**

కేవలము ఆత్మానందము కొఱకే సాధన చేయవలెను. సిద్ధుల కొఱకు ప్రయత్నం చేయవద్దు. అవి మళ్ళీ దారి తప్పిస్తాయి. అందువల్ల వాటి కొఱకు వ్యామోహపడక ఆత్మానందము కొఱకు సాధన చేయవలెను.

**మనస్సునందు స్మరణము లేక, విస్మరణము లేకయుండుము. నిన్ను దుఃఖ విముక్తుని చేయు బ్రహ్మముగా, శుద్ధ చైతన్య ఘనముగా ఉన్న పరమశివుని జ్యోతిర్మయ పాదములను గట్టిగా పట్టుకొనుము; అతిశయించిన ఆ అనుగ్రహాధీనుడవై యుండుము.**

నిరంతరమూ సాధనలో వుంటూ భగవంతునికి పరిపూర్ణ శరణాగతి పొందాలి. లేకపోతే గమ్యాన్ని చేరలేము. సాధన వల్ల మాత్రమే ఆత్మానుభవం కలుగుతుందనే భ్రమలో ఉండొద్దు. భగవంతుని అనుగ్రహం వలన మాత్రమే ఆత్మానుభవం కలుగుతుంది. లోకంలో ఏ పని అయినా భగవంతుని అనుగ్రహం వలననే జరుగుతుంది. భగవద్గీతలో భగవానుడు "భగవంతుని మాయ నుండి ఎవరూ తప్పించుకొనలేరు. భగవంతుని మాత్రమే శరణు పొందినవారు మాత్రమే ఆ మాయను దాటుతారని" అన్నాడు. భగవంతుని అనుగ్రహం కొఱకు ఓపికగా, సహనంగా వేచిఉండాలి.

**జీవుడు మాయాహంకారవశుడై యుండుట చేత ప్రారబ్ధఫలానుభవం నుండి కించిత్తైనను తప్పించుకొనలేడు. అందువలన, ప్రధానముగా భగవదనుగ్రహముపై ఆధారపడి అతడు హృస్థితుడు కావలయునేగాని, అహంతా వ్యాపారమయిన స్వప్రయత్నము మాత్రము చేత ప్రారబ్ధ వేగపాతమును తట్టుకొనలేడు. తనకు తానుగా హృదయములో మునుగలేడు. భీతికొలువు భ్రాంతి నుండి విముక్తిని పొందలేడు. ఆత్మ సాక్షాత్కార ఫలమును పొందలేడు.**



జీవుడు మాయవలన అహంకారవశుడై పాపపుణ్యాలు చేస్తూ ఉంటాడు. సంసారబద్ధుడవడంవల్ల ప్రారబ్ధాన్ని తప్పించుకోలేడు. తను చేసిన కర్మ ఫలితాలనుండి తప్పించుకొనలేడు. అందుచేత ప్రధానముగా భగవంతుని అనుగ్రహముపై ఆధారపడి తన హృదయములో మునగాలి. తన స్వంత ప్రయత్నముతో ఆత్మ నిష్ఠుడవుతానని అహంకరించరాదు. ఈ సంసార భ్రాంతి నుండి విడివడాలంటే, ఆత్మానుభవం పొందాలంటే కేవలము భగవంతుని అనుగ్రహము వలన మాత్రమే. నీవల్ల ఏది జరిగినా అది నీవల్ల కాదు, భగవంతుని అనుగ్రహం చేతనే అయినది అన్న సంగతి తెలుసుకొని నీవు భగవంతుని శరణాగతిని పొందుము. నీ హృదయములో మునిగి ఆత్మానుభవమును పొందుగావుత అని భగవాన్ మనకి చెబుతున్నారు.

**హరిఃఓం తత్సత్** **(సమాప్తం)**

మనశ్శాంతి పొందగోరితే, ఇతరుల లోపాలెంచకు అంతకంటె నీ లోపాలు పరికించు. యావత్తు ప్రపంచం నీదనే భావన పెంపొందించుకో. ఎవ్వరూ పరాయివారు కాదు. ఈ ప్రపంచమంతా నీ సొంతమే.

**శ్రీ శారదామాత**

చివరకు యోగి, అత్యంత ముఖ్యమైన దైవధ్యానము సేవ కార్యక్రమము వంటి సత్కార్యములందుకల ఆసక్తి, ఆకర్షణ కూడ దైవసాన్నిధ్యమందలి తన్మయత్వ ఆనందములో వదలి వేయవలెను.

**శ్రీ పరమహంస యోగానంద**

యజ్ఞం, దానం, తపస్సు అనే మూడు సాధనాలు వేదమాత జనులకు ఉపదేశించింది. ఈశ్వరారాధన అనే భావంతో సకల ప్రాణలకును యథోచితంగా ఉపకారమొనర్చే వారి వ్యవహారమంతా యజ్ఞదాన తపస్సే. దీనివల్ల జనులు శాశ్వతమైన శాంతిని పొందగలరు.

**శ్రీ సచ్చిదానందేంద్ర సరస్వతి**

వర్షములేని కాలములో గల జీవితమెటువంటిదో, చంద్రుడులేని రాత్రిగల సంచార మెటువంటిదో, రోగముతో గూడిన బ్రతుకు యెటు వంటిదో, శాంతిలేని జీవితమును అటువంటిదే.

**శ్రీ సద్గురు మలయాళ స్వామి**

మనకు సర్వావస్థలయందును సర్వసన్నివేశముల యందును శాంతి, ఆనందములను పొందవలెనన్న కోర్కె యుండును. ఈ ఆనందము సహజానందము. ఆ స్థితి సహజ సమాధి. ఈ అత్యుత్కృష్ట స్థితిలో విముక్త జీవి సర్వకాలముల యందును దివ్యానందము ననుభవించుచుండును. అట్టి స్థితిలో నిరంతరము మార్పు చెందెడి భౌతిక సంఘటనలు, దశలలో నతడేమియు కలతజెందడు. ఏలనన అతడు ప్రతిమార్పునందును, ప్రతి కృత్యమునందును నిత్యానందపు చైతన్యమునే దర్శించి అనుభవించును.

**శ్రీ పప్పా రామదాసు**

# భస్మాసుర హస్తము

**మూలం : భారతి** **అనువాదం : గరిగిపాటి కృష్ణ**

## దుష్టులకిచ్చిన వరము అనర్థ దాయకము

ఒక రాక్షసుడు మంచు కరగని హిమాలయాల శిఖరాగ్రమున కూర్చొని ఘోరమైన తపమాచరిస్తాడు. అతడు శివుని భక్తుడవడము చేత తిండి, బట్టలు, శీతోష్ణములను లెక్కచేయక ఏకాగ్రచిత్తముతో శివుని "శివ–శివా, శివ–శివా, శివ–శివా" అని తదేకముగా ధ్యానించసాగాడు. అతని పేరు భస్మాసురుడు.

అలా ఎన్నో వందల సంవత్సరాలు గడిచిన తరువాత శివుడు అతనిని అనుగ్రహించదలిచాడు. ఒకరోజు భస్మాసురుడు ధ్యానమగ్నుడై వున్నప్పుడు మహదేవుడు అతనికి ప్రత్యక్షమయ్యాడు. ఉదయ భానునివలె శివుడు ఆ సమయంలో ప్రకాశిస్తున్నాడు. శివుని రూపము ఒక గొప్ప యోగీశ్వరునిలా జింక చర్మము ధరించి, శరీరమంతా విభూతితో నిండి, వేళాడే జటలతో, మెడకు పాములు చుట్టుకొని వుండి చేతిలో త్రిశూలమును ధరించి దివ్యకాంతులను వెదజల్లుతూ శోభాయ మానముగా అలరారుతోంది. ఆహా! ఆ దివ్యమైన, భవ్యమైన రూపాన్ని వర్ణించడానికి మాటలు చాలవు. ఆ తేజోమయ రూపాన్ని చూసి భస్మాసురునికి కళ్ళు మిరుమిట్లు గొలిపాయి. శివుని దివ్య మనోహర రూపాన్ని చూసి మాటలు రాక "శివ–శివా, శివ–శివా, శివ–శివా" అనసాగాడు. విస్మయానికి గురి అయిన భస్మాసురునితో శివుడు మృదుమధురముగా "నీవు చేసిన కఠోరమైన తపస్సుకు నేను మెచ్చాను. నీవు కోరిన వరమేదైనా ఇవ్వడానికి సిద్ధముగా ఉన్నాను." అంత భస్మాసురుడు ఇలా ఆలోచించసాగాడు. "నేను గొప్ప తపస్విని అయి ఉంటాను. అందుకే శివుడు నన్ను వరము కోరుకొమ్మన్నాడు," బిగ్గరగా అతడు, "ప్రభూ! నేను దేనినయితే నా కుడిచేతితో స్పృశిస్తానో అది భస్మమై బూడిదగా మారాలి. "శివ–శివా" భస్మాసురుడు అన్ని వందల సంవత్సరాలు తపస్సు చేసినా అతని రాక్షసప్రవృత్తిని విడనాడలేదు. "శివ–శివా" దౌర్భాగ్యము కాకపోతే ఇలాంటి వరము కోరడమేమిటి? కృపాసాగరుడైన మహదేవుడు 'తథాస్తు' అని పలికాడు.

అంత భస్మాసురుడు "ప్రభూ! నీవు వరమైతే ప్రసాదించావు కాని అది నిజమని నేనెలా నమ్మను? ఒకసారి నీవు అదృశ్యమయ్యాక, నిన్ను మళ్ళీ ప్రసన్నుడికి చేసుకోవడానికి నీ దర్శన భాగ్యమవడానికి కొన్ని వందల సంవత్సరాలు పడుతుంది. అందుచేత నీవిచ్చిన వరాన్ని నేను పరీక్షించదలచాను. ఇదేమో దట్టమైన మంచుతో కప్పబడిన పర్వతము. ఈ ప్రదేశములో అందుబాటులో ఏమీ కానవచ్చుట లేదు. అందుచేత నీవే నా ముందుకు వస్తే, నీ తలపై నా చేతిని వుంచి నీ వరము నిజమో, కాదో తేలుస్తాను."



"శివ–శివా, శివ–శివా, శివ–శివా" క్రూరుడైన ఆ రాక్షసుడు తాను శివుని తలపై తన చేతిని ఉంచి శివుని మట్టుపెడితే తనకంటే ఈ విశ్వములో గొప్పవాడు మరొకడు వుండడని తలచాడు. శివుని మనస్సు ఆందోళనతో నిండింది. తాను భస్మాసురుని కోరిక తీరిస్తే తాను భస్మమవడము తప్పనిసరి. శివుడు లేని ఈ లోకము అల్లకల్లోలమవుతుంది. అయినా ఒకసారి ప్రదానము చేసిన వరమును తిరిగి తీసుకోవడమెలా? దీనిక ఒకటే దారి–తాను భస్మాసురుడి బారి నుండి తప్పించుకొని పరిగెత్తడమే. అలా శివుడు పరిగెత్తసాగాడు. అతడు త్రిశూలమును చేత ధరించి, కాళ్ళు సహకరించినంత వేగముగా వెళ్తున్నాడు. మహదేవుడు ఆ విధముగా పర్వతాలు, లోయలు, నదులూ, సరస్సులూ, మైదానాలు, పంటపొలాలు, పూరిళ్ళు, ఆశ్రమాలు, దట్టమైన అడవులూ దాటుకుంటూ పరుగు పెడుతూనే ఉన్నాడు. ఆశ్చర్యకరముగా భస్మాసురుడు అతడిని వెంట తరుముతూనే వున్నాడు. "శివ–శివా" అది ఎంత వింత గొలిపే సంఘటన! విశ్వానికి ప్రభువైన మహదేవుడు తన ప్రాణాన్ని కాపాడు కోవడానికి పరుగు పెట్టడమా! అది కూడా ఒక దుష్టరాక్షసుని బారినుండి తప్పించు కోవడానికి. ఈ కల్లోలానికి పక్షుల హృదయాలు అల్లల్లాడి అవి చెట్లపైనుండి చెల్లాచెదురుగా ఎగురసాగాయి. జంతువులు భయంతో దూరంగా వెళ్ళసాగాయి. భయము ముప్పిరిగొనిన శివుడు వేగముగా పరిగెత్తసాగాడు. "శివ–శివా". అతనికి కొంత దూరములో భస్మాసురుడు వెంబడించసాగాడు.

శివుడికి అప్పుడు శ్వాస తీసుకోవడము కష్టంగా మారింది.

భస్మాసురుడు తనను వెంబడించడము వలన తాను పరుగుపెట్టి చాలా అలసిపోయాడు. అయినా మహదేవుడు ఏమి చేయగలడు? అలా పరుగు కొనసాగించడము తప్ప. కాని ఆ సమయములో ఏదైనా వింత జరిగితే తప్ప ఆ రాక్షసుని బారి నుండి తప్పించుకోవడము అసాధ్యమనిపించింది.

ఆ సమయములో విష్ణుభగవానుడు వైకుంతము నుండి భూలోకములో జరిగే వింతను ఆశ్చర్యముగా గమనిస్తున్నాడు. ఆయన శివుడు అనాలోచితముగా ఇచ్చిన వరమే శివుని ఈ దుస్థితికి కారణమని గ్రహించాడు. శివునికి తాను సహాయ పడవలసిన తరుణమిదేనని భావించాడు. శివ, కేశవులు అభిన్నులు కదా! "శివ–శివా, శివ–శివా, శివ–శివా" శివుడు పరుగు కొనసాగిస్తూ ఒక పర్వతముయొక్క మలుపు తిరగడము, భస్మాసురుడు వెనకబడడము జరిగాయి. అదే సమయములో శ్రీ మహా విష్ణువు ఒక అందమైన మోహిని అనే పేరుగల స్త్రీ రూపము ధరించి పర్వతపు మలుపు వద్ద నిలచాడు. అంతలో భస్మాసురుడు ఆయాసపడుతూ పరుగెత్తి వస్తూ ఉండడము మోహిని గమనించి, అతని చేతిని పట్టుకొని ఇలా అంది, "మహారాజా! మీరు ఎంతో అలసినట్లు కానవస్తున్నారు. మీరు అంత వేగముగా ఎందుకు పరుగు

పెద్తున్నారు? రండి, మా తండ్రిగారి ఆశ్రమము ఇచటికి చేరువలోనే ఉన్నది. అక్కడ కొంతసేపు విశ్రాంతి తీసుకొని, ఆహారమును భుజించి కోల్పోయిన మీ శక్తిని తిరిగి పుంజుకొని మరింత వేగముగా మీ ప్రయాణము కొనసాగించవచ్చు."

భస్మాసురుడు మోహినివైపు అసహనముగా చూసి తన చేతిని ఆమెనుండి విడిపించుకొని ఇలా అన్నాడు, "ఓ యువతీ! నన్ను పోనీ, ఆ దుర్మార్గుడైన శివుడు నన్ను తప్పించుకొనిపోతాడు. నేను అతని శిరస్సుపై నాకుడిచేతిని ఉంచి అతనిని భస్మము చేస్తే నేనే ఈ ముల్లోకములకు స్వామిని అవుతాను." తను తిరిగి పరుగెత్తి వెళ్ళే సమయములో మొదటిసారి మోహిని వైపు తదేకముగా చూసాడు. ఆమె అందానికి అతను ముగ్ధుడయ్యాడు. ఆమె నల్లని కురులు, అందమైన కనుబొమ్మలు, విశాలమైన నయనాలు, సన్నని సుకుమారమైన పెదవులు, చక్కటి ఆకృతిగల వేళ్ళు, కొద్దిగా వంచిన మేను, అందమైన పాదాలకు ధరించిన గజ్జెలు చూడగానే, శివుడు తనకిచ్చిన వరమును మరచిపోయాడు. మోహిని వైపు కళ్ళప్పగించి నఖశిఖ పర్యంతము తేరిపార చూశాడు. అలా పదేపదే ఆమెనే చూస్తూ ఆమె అందానికి ముగ్ధుడయ్యాడు. అతని హృదయము మోహిని పట్ల పూర్తిగా ఆకర్షితమయ్యింది. "శివ-శివా".

అతడు ఆమెను పట్టుకోవడానికి ముందుకు దుమికాడు కాని మోహిని తెలివిగా వెనుకకు జరిగింది. అప్పుడు భస్మాసురుడు, "నీవు చాలా అందముగా ఉన్నావు. నిన్ను పెళ్ళాడవలెనని ఆశ పడుతున్నాను. నీకు సమ్మతమేనా?" అని అడిగాడు.

మోహిని చిరునవ్వు నవ్వి ఇలా అంది, "మహరాజా, నిన్ను నేను ఎలా నమ్మగలను? నేను వివాహమాడదలచిన వ్యక్తి ఎప్పటికీ మారు మనువు చేసుకోకూడదు. మీ రాక్షస జాతివాళ్ళు అనేకమంది 'స్త్రీలను వివాహము చేసుకోవడము పరిపాటి కదా. అందుచేత మీ ప్రతిపాదన అంగీకరించలేను." అని ఒక నిట్టూర్పు విడిచింది.

భస్మాసురుడు అతిశయించిన మోహముతో, "మోహిని, నేను ఆత్మసాక్షిగా ప్రమాణము చేస్తున్నాను. నిన్ను కాక మరే ఇతర స్త్రీని వివాహమాడను. అంతెందుకు, నిన్ను పరిణయమాడిన పిదప నేను పరస్త్రీని కన్నెత్తికూడా చూడను. నన్ను నమ్మి నీ అంగీకారము తెలుపు."

మోహిని భస్మాసురుని వైపు ఓరకంటితో చూసి, లజ్జను నటిస్తూ తన చూపు మరల్చుకొంది. "ఓయీ, మీ పురుషజాతిని ఏ పాటి నమ్మవచ్చో నాకు తెలియనిది కాదు, "శివ-శివా." మీ శుష్కవాగ్దానములను నమ్మితే, మమ్మల్ని నట్టేట ముంచడానికి మీరెంతకైనా తెగిస్తారు. నేను నిన్ను నమ్మాలంటే నీ కుడిచేతిని నీ శిరస్సుపై ఉంచి నన్ను వివాహము చేసుకొన్న తరువాత వేరే స్త్రీని వివాహమాడనని శపథము చెయ్యాలి.



భస్మాసురుడు మాయామోహితుడై, తన కుడిచేతితో శిరస్సును తాకుతాడు. "మోహినీ, నీ వాగ్దానము....అని ఆరంభించాడు. కాని అతను వాక్యమును పూర్తి చేసేవరకు ప్రాణములతో ఉండలేదు. అతని శిరస్సును తాకుతూనే అతడు కాలి బూడిదైపోయాడు. "శివ-శివా, శివ-శివా, శివ-శివా".

శివుడు అలా రొప్పుతూ పరుగుపెడ్తూనే తన భుజముపై నుండి భస్మాసురుని జాడ కోసమై వెనుకకు చూసాడు. కాని కనుచూపు మేరలో భస్మాసురుడు కానరాలేదు. అద్భుతము! ఏమి జరిగి ఉండవచ్చు అని ఆలోచించసాగాడు. ఆ రాక్షసుడు విశ్రాంతికై ఎక్కడా కూర్చోడానికి ఆస్కారము లేదు. అతనికి విపరీతమైన శక్తి ఉంది కాబట్టి అంత త్వరగా అలసట చెందడు. కొంతసేపటి వరకు శివుడు తానున్నచోటే నిలబడినా భస్మాసురుని జాడ తెలియరాలేదు.

అప్పుడు శివుడు వెనుకకు మరలి పర్వతపు వంపు వద్దకు చేరాడు. అక్కడ అతనికి కుప్పగా పోసిన బూడిద కనిపించింది. అంతేకాక ఆ ప్రక్కనే అందాలరాశి అయిన ఒక స్త్రీ నిలబడిఉంది. ఆమెను శివుడు భస్మాసురుని గురించి అడగగా ఆమె అణకువ నిండిన స్వరముతో జరిగిన సంఘటన మొత్తం వివరించింది.

శివుడు ఆమె సకాలములో తనకు సహాయము చేసినందుకు ఎంతగానో సంతోషించాడు. అంతకన్న ఆమె శివుని ప్రశంసించడము ఎంతో ఆనందాన్ని కలిగించింది.

"ప్రభూ! నేను మీరు విపత్కర పరిస్థితిలో ఈవిధంగా పరుగు పెట్టడము చూసాను. మిమ్మల్ని భస్మాసురుడు చేరుకొని మీ తలపై తన కుడిచేతిని ఉంచితే ఈ విశ్వములోని జీవరాశి ఏమి కావాలి? అందుకే నేను ఆ దుర్మార్గుడిని మాయోపాయముతో నన్ను వివాహమాడిన పిదప మరే స్త్రీని వివాహమాడనని తన శిరస్సుపై చేయిని ఉంచి శపథము చెయ్యమని అడిగాను. నేను ఇదంతా మీ కోసమే చేసాను ప్రభూ," ఇలా అంటూ ఆ స్త్రీ ముకుళిత హస్తములతో తన శిరస్సును వంచింది.

శివుడు ప్రసన్నుడై ఆమెను తన కౌగిలిలో బంధించాలనుకున్నాడు. కాని ఆమె చాకచక్యముగా శివుని కౌగిలి నుండి తప్పించుకొంది. అతడు ఆమె చర్యకి దిగ్భ్రాంతికి లోనయ్యాడు. అటు తరువాత మోహిని జాడ ఎక్కడా కనిపించలేదు. ఆమెకు బదులుగా చతుర్భుజాలతో అతి సుందరమూ, ప్రకాశవంతమైన రూపముతో విష్ణు భగవానుడు దర్శనమిచ్చాడు. ఆ ప్రభువు చిరుదరహాసముతో తన చుబుకము పైకెత్తాడు.

శివుడు కూడా నవ్వుతూ విశ్వరక్షకుడైన ప్రభువు మరల ఇలా శిష్టరక్షణ, దుష్ట శిక్షణకై పూనుకొని సృష్టిలో సమతుల్యతను కాపాడాడని గ్రహించాడు.

"శివ-శివా, శివ-శివా, శివ-శివా".

# తత్త్వమసి

**అనువాదం : శ్రీ తెన్నేటి విశ్వనాధం**

**(ఆగస్టు 2022 సంచిక తరువాయి)**

**రంగము – ౬**

దూరముగా నదీప్రవాహము. రావిచెట్టు క్రింద కుటీరము. పువ్వుల తీగలు కుటీరము పైని అల్లుకొని ఉండును. దూరముగా లేడిపిల్లలు లేతగడ్డి మేయుచుండును.

**ప్రవేశము: ఉద్దాలకుడు, శ్వేతకేతువు, శిష్యులు**

**ఉ।।** (గడ్డము సవరించుకొనుచు శిష్యులవైపు చూచి) శ్వేతకేతూ, పూర్వ సంధ్యావిధులు చక్కగ నిర్వర్తించితిరా!

**శ్వే।।** ఓ.

**శిష్యులు:** చక్కగ నిర్వర్తించినాము.

**ఉ।।** శ్వేత. ఏదీ నిన్నటి ఘటము.

**శ్వే।।** నిన్న మీరుంచమనిన చోటనే ఉంచితిని. అక్కడనే ఉండియుండును.

**ఉ।।** మీరడిగిన మీదట ఆ ఘటములో లవణపుగడ్డనుంచుమంటిని. మరి ఆ ఘటము నిక్కడకు తేవలదా?

**శిష్యులు।।** ఒక్కక్షణములో తేగలవారము. (అని ఇద్దరు పరువున పోదురు)

**శ్వే।।** ఆ సంబంధము స్ఫురణకు రాలేదు.

**ఉ।।** నాయనా, గురువు ఒకమాట చెప్పిన ఆ పై రెండు మాటలు శిష్యుడు గ్రహింపవలెను. (శిష్యులా ఘటమును తెచ్చి ఉద్దాలకుని యెదుట మెల్లగ నుంచెదరు).

**శ్వే।।** నాతప్పు క్షమింపుడు.

**ఉ।।** సూక్ష్మమయిన దానినెందుకు తెలిసికొనలేమని గద నీసందేహము.

**శ్వే।।** చిత్తము.

**ఉ।।** నాయనా. ఈ కుండలో నిన్న ఉంచిన లవణపు గడ్డ పైకి తీయుము.

**శ్వే।।** లేదు నాయనా, అందు అది ఎట్లుండును?

**ఉ।।** చూపునకు స్పర్శకు కానరాని లవణపుగడ్డ అందు లీనమై ఉన్నదిగద.

**శ్వే।।** ఆ, ఉన్నది.

**ఉ।।** దర్శన స్పర్శనములకు లేకున్నను మరియొక సాధనమున ఉన్నదని తెలిసికొనగలముకదా!

**శ్వే।।** ఎట్లు.

**ఉ।।** ఆ నీటి పైభాగము పుడిసెడు తీసి త్రాగుము.

**శ్వే।।** (అట్లు చేయును).



**ఉ।।** ఎట్లున్నది?

**శ్వే।।** ఉప్పగనున్నది.

**ఉ।।** మధ్యభాగమునందలి నీరు పుడిసెడు త్రాగుము.

**శ్వే।।** (అట్లు చేసి) ఇదియును ఉప్పగనే ఉన్నది.

**ఉ।।** అడుగుభాగమున ఉన్న నీరు పుడిసెడు త్రాగుము.

**శ్వే।।** (అట్లుచేసి) ఇదియు ఉప్పగనే ఉన్నది.

**శిష్యులు।।** (తమలోతాము) ఇందులో వింతయేమున్నది. అయినను వినెదము.

**ఉ।।** నిన్నటి లవణపు గడ్డ ఈనీటియందే ఉన్నదిగద!

**శ్వే।।** అవును నీటియందంతటను వ్యాపించియున్నది.

**ఉ।।** దేహసంఘాతము తేజోభిన్నమైనది గదా!

**శ్వే।।** అధిష్ఠాన సత్తాస్వరూపము ఆ సంఘాతము నందు వ్యాపించియున్నది. లవణము దర్శన స్పర్శములకు దొరకనట్లే ఈ సత్పదార్థము వాఙ్మనము లకు దొరకదు. అక్కడ రసనచే తెలిసికొనగలిగితిని. ఇక్కడ ఉపదేశ సాధనానంతరమున తెలియగలవు.

**శిష్యులు।।** బాగు, బాగుగ సెలవిచ్చినారు.

**ఉ।।** సకల జగదధిష్ఠానము సత్తామాత్రము. అది సూక్ష్మము. న్యగ్రోధ ఉదాహరణమున, బీజమున అంకురజననశక్తి ఎట్లు సూక్ష్మమైఉన్నదో తెలిసికొంటిరి. లవణోదాహరణమువలన అది సర్వవ్యాప్తమైనదని తెలిసి కొంటిరి. ఆ సూక్ష్మమైనదేసన్మాత్రము. ఈ సర్వము ఆ సత్తా మాత్ర స్వరూపము. అదియే సత్యమైనది, ఆ సత్యమైనదే ఆత్మ. ఆ ఆత్మయే నీవు, తత్త్వమసి.

**శిష్యులు।।** }
**శ్వే।।** } (ఒకేమారు ఉద్దాలకుని పాదములకు మ్రొక్కుదురు)

**ఉ।।** జగదధిష్ఠానమైన సన్మాత్రమైన దాని స్వరూపము దర్శనస్పర్శన వాఙ్మనములకు అగోచరము. ఉపాయాంతరముల చేతనే గ్రహింప నగును అని తేలినదిగదా.

**శిష్యులు।।** }
**శ్వే।।** } (మరొకమారు గురువు పాదములకు మ్రొక్కుదురు)

(ఉద్దాలకుడు నిష్క్రమించును.)

**శ్వే।।** నేనిప్పటికి గ్రహించినది చెప్పెదను వినుడు.

**శిష్యులు।।** చెప్పుము, చెప్పుము, గురువుగారి కుమారుడవు, కుమారగురువవుకదా.

**శ్వే।।** సర్వజగత్తునకు భీజభూతమైనదేదిగలదో.

(న్యగ్రోధపాఠనము) అది సూక్ష్మాతి సూక్ష్మమై యున్నది;
(సముద్రపాఠకము) అది నిత్యమైయున్నది.
(దర్శనపాఠము) అది నిర్వికారమైనది.
(మృణ్మయపాఠము) అది సత్యమైనది.
అది అహమాదిసర్వకృతులకు సాక్షియైయున్నది.
అది కూటస్థమైనది. అసంగమైనది.
అది ప్రత్యగాత్మ స్వరూపమైనది.
అది చిన్మాత్రమైనది.
(లవణపాఠకము) అది సర్వ ప్రపంచవ్యాప్తమగుటచేత
(దర్శనపాఠకము) వ్యాపించిన ప్రతిచోట సంపూర్ణమైనదనుట చేత అదియే నేను, నేనన్న అదియే ఆది యన్న నేనే.

**శిష్యులు॥** (అందరు) శ్వేతకేతూ, (అంజలిఘటియించి) హృదయ సంయుక్త వందన శతములివి స్వీకరించు తత్త్వమసి! తత్త్వమసి!తత్త్వమసి! (తెరదిగును.)

**రంగము - ౨**

**ప్రవేశము: ఉద్దాలకుడు, శ్వేతకేతువు, శిష్యులు**

**శ్వే॥** ఆ ఆత్మ ఏకము: అందుచేత అది అద్వితీయము అని సెలవిచ్చితిరి. మరి అట్టి ఆత్మకు అనగా నాకు కర్తృత్వమెట్లు కలుగుచున్నది. అందుచేత నాయన గారూ, తిరిగి నాకీ విషయము మరొకమారు చెప్పుదురుగాక.

**శిష్యులు॥** చిత్తము, భగవన్, మాకున్న సందియమునే శ్వేతకేతువు తమకు చెప్పినాడు.

**ఉ॥** అయినచో ఏకాగ్రచిత్తము కలిగి వినుడు. గాంధార దేశమందు ఒక కుర్రవానిని చోరులు పట్టుకొనిరి. కనులకు గట్టిగ గుడ్డకట్టినారు. వానికేమియు కనబడకుండ చేసినారు. అరణ్య మధ్యమునకు తీసుకొని పోయినారు. వానిదగ్గరగలదెల్ల హరించినారు. వానినట్లే వదలిపెట్టి వెళ్ళిపోయినారు.

**శిష్యులు॥** అయ్యో, పాపమెంతపని చేసినారు?

**ఉ॥** సరే, ఆ కుర్రవాని గతియేమగును? అన్ని దిక్కులకు తిరిగి, "చోరులు నా కళ్ళు గుడ్డలతో మూసి కట్టివేసినారు. నే గాంధారవాసిని. నేనిప్పుడెక్కడ వుంటినో తెలియదు. సాయము చేయువారెవరైన లేరా, లేరా" అని కేకలువేయుచు ఎటుపోవుటకు తెలియక ఇటునటు తడుముకొను చుండెను.

**శ్వే॥** నిజమే, అది అరణ్యము, ఏమీ చేయగలడా కుర్రవాడు. ఎవరైనా అదృష్ట వశమున నతని జూచి సాయము చేయనిచో అక్కడే కృశించి నశించవలసి నదే గదా!



**ఉ॥** అదృష్టవశమంటివిగదా? అటులనే, ఒకడక్కడ సంప్రాప్తమై వానిచేతులకు కన్నులకుగల బంధనములను విడదీసినాడు. అప్పుడాతడు అరణ్యము దాటి గ్రామము నుండి గ్రామమునకు "గాంధారమునకు త్రోవయేది" అని అడిగి ఏలాగుననో గాంధారము చేరుకొని సుఖవంతుడయ్యెను.

**ముని॥** స్వామీ, ఈ కథ అర్థము?

**శి॥** నే చెప్పెదను.

**శ్వే॥** నే చెప్పెదను వినుడు. ఈ కుర్రవాడు సంసారి. దొంగలు విషయేచ్ఛలు. కంటికి బంధనములు-సుకృత దుష్కృతములు, వాసనలు, అవిద్య అరణ్యము: ద్వంద్వ సమావృతము. త్రోవనడుగుట; కర్తృత్వమందభిని వేశము. ముందు వెనుకలకు పోవుట: జననమరణ సుఖదుఃఖముల పరంపర, మమేతర వ్యామోహము
అదృష్టవశమున కనిపించినవాడు : ఆచార్యుడు
త్రోవ తెలిసికొనుట : అద్వితీయ బ్రహ్మతత్త్వ జ్ఞానమునలవరించుకొనుట.
తిరిగి గాంధారమునచేరుట: ఆత్మ బ్రహ్మయందైక్యమగుట.

**ఉ॥** సర్విశేత కేతూ, కొంతత్రోవలోపడితివి.
అపరోక్ష బ్రహ్మజ్ఞానము కలిగిన స్థితికాపురుషుడు (కుర్రవాడు) వచ్చినాడు. అది దృఢమైన యెడల వాసనాక్షయమగును. వాసనాక్షయ మైనపుడు ముక్తి సంభవించును.
అనగా,తత్ - ఆ పదార్థము
త్వం - నీవు
అసి - అగుచున్నావు.
తత్త్వమసి, శ్వేతకేతూ - తత్త్వమసి.

**శ్వే॥** అయినచో ప్రారబ్ధ కర్మము.

**ఉ॥** తిరిగి మొదటికేవచ్చితివి, జాగ్రత్తగ వినుము. ఆ బ్రహ్మైక్యానుభూతి కలుగుటలో ప్రారబ్ధ కర్మముగూడ క్షయమగునయ్యా. "తత్ త్వం అసి" అనికదా చెప్పితిని.

**శ్వే॥** ధన్యుడనైతిని.

**శిష్యులు॥** ధన్యులము, ధన్యులమైతిమి.

**శ్వే॥** ఆత్మకు కర్తృత్వ భోక్తృత్వములు అజ్ఞానముచే ఆరోప మాత్రములు; ఏకమై, విశ్వవ్యాప్తమైన ఆత్మకు అట్టివి నిజముగలేవు. ఉండలేవు.

**శిష్యులు॥** అద్వితీయ బ్రహ్మమన ఏదియో ఇప్పటికి కొంచెము తెలిసినది.

**ఉ॥** తెలిసినదానిని దృఢపరచుకొనుము అనుభవించుము అపుడు తత్త్వమసి.

ఇది ఒకటి తెలిసిన యెడల సర్వమును తెలిసినదగును. ఇది ఒకటి విినిన యెడల సర్వమును వినినదే యగును.

ఒకరినొకరు: తత్ త్వం అసి

**ఉ॥** తత్ త్వం అసి

**శ్వే॥** నాయనా, తత్ త్వం అసి.

అందరును. వయం వేదాంత సునిశ్చితార్థాః

(తెరదిగును,) (సమాప్తి)

**ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః**

భావతరంగములు సముద్రతరంగముల వంటివే. చిత్తమే శాంతి చెందినచో దానిలో రత్నము అనాయాసముగ మొలకెత్తును.

**సంత్ కబీరు**

ఈ శరీరమనే వేణువును భగవంతునికి ఒప్పచెప్పు. ఈ మిధ్యాహంకృతిని–ఈ క్షుద్ర దేహభ్రాంతిని ఆహుతి చెయ్యి. అతీతుడువుగా, పూర్ణ స్థితికి అధిగమించు. భగవంతుడు స్వయముగా తన అమృతహస్తాలతో నీ శరీరమనే వేణువును పూర్ణ స్థితికి అందు కుంటాడు. ఆ మహాగాయకుడు తానే ఈ వేణువును పాడుతాడు. అప్పుడు మధుర గాన వాహినులు ఉప్పొంగి పారుతాయి.

మీ జీవితమంతయు శాంతిమయమగుగాక! ఎవరు శాంతిని హృదయమునందు అనుభవించెదరో వారు దైవమును గుర్తించినవారే యగుదురు. ఏలయన దైవము శాంతి అనునవి రెండు కాదు ఒక్కటియే గనుక! శాంతికేంద్రమును మీ లోపలనే స్థాపించుట అత్యంత సులభము. అట్టి శాంతి కేంద్రమునకై మీరెట్టి వ్యయప్రయాసలకు లోను కావలసిన అసరము లేదు. మీరు చేయవలసినదంతయు వెలుపల నుండి లోపలకు మీ కేంద్రమును మార్చుకొనుటయే. అందుకు తగిన సమయము స్థలము కూడ ఇప్పుడు ఇక్కడనే. వ్యక్తి శాంతియే విశ్వశాంతికి మూలము. గాన మీయందే శాంతిని బడయుడు. **స్వామి ఓంకార్.**

కొమ్మమీద స్వేచ్ఛగా కూర్చున్న పక్షిలాగ మనం ఉండాలి. పక్షి కొమ్మమీద కూర్చుంటుంది. కొమ్మ ఊగుతుంటుంది. క్రిందికి, పైకి కొమ్మ కదులుతూ ఉంటుంది. కాని ఆ పక్షికి తనకు రెక్కలున్నవని తెలుసు. అందుచేత అది భయపడదు. అది పైకి కొమ్మమీద కూర్చున్న, లోపల తనరెక్కల మీదనే ఆధారపడియున్నది. "ఈ కొమ్మమీద ఆధారపడి లేను. నేను నా రెక్కలమీదనే ఆధారపడియున్నాను." అని ఆ పక్షికి తెలుసు. ఇది విధానం. పక్షి కొమ్మమీద ఆధారపడిలేదు. తన రెక్కల మీదనే ఆధారపడియున్నది. అదే ప్రకారం నీవెక్కడ వున్నా, నీవు ఎంత భార్యాపుత్రులతో కలసి వున్నా, వాండ్ల మీద ఆధారపడమాకు. పరమాత్మ మీద నీ హృదయం వుంచు. నీలోని బ్రహ్మత్వం నందు విశ్వాసముంచు. ఇదే మార్గము. ఈ మార్గములో నీవు నడువు. నీ భార్యా పుత్రులను కూడా ఈ మార్గములో నడిపించు. ఎవరికి బంధం లేదు. విముక్తి! స్వేచ్ఛ! స్వాతంత్ర్యం! **స్వామి రామతీర్థ**



# తులసీ సర్వస్వము

## VII అధ్యాయము

**జి.వి.యస్.సుబ్రహ్మణ్యశాస్త్రి**

## 26. తులసికి గల వివిధ శక్తులు

ఎ) పాపవినాశనశక్తి

బి) శత్రునాశనశక్తి

సి) సర్వసంపత్ప్రదానశక్తి

డి) పుణ్యప్రదానశక్తి

ఇ) సర్వార్థసాధనశక్తి

ఎఫ్) మోక్షప్రదానశక్తి

జి) వైకుంఠలోకమునకు చేర్చు శక్తి

హెచ్) భగవత్ప్రీతిని కలిగించు శక్తి

### ఎ) తులసికి గల పాపవినాశనశక్తి

**శ్లో॥ నిత్య మభ్యర్చయేద్ యో వై తులస్యా పరమేశ్వరమ్ ।**
**మహాపాపాని నశ్యంతి కింపున శ్చోపపాతకమ్ ॥**

**(బ్రహ్మాండపురాణము)**

తా॥ ఎవడు నిత్యము తులసీదళములతో, భక్తితో ఈశ్వరుడైన హరిని పూజించునో, అతడు జన్మాంతరములలో సంపాదించుకొనిన మహాపాపములన్నియు నశించిపోవును. ఇక ఉపపాతకములు కూడ నశించునని వేరుగా చెప్పవలెనా? అక్కరలేదని భావము.

**శ్లో॥ హరే ర్గృహం యథా యస్తు తులసీదళ విప్రుశైః ।**
**త్రిసంధ్యం ప్రక్షాళ్య తస్మా న్మహాపాపైః ప్రముచ్యతే ॥**

**(బ్రహ్మాండపురాణము)**

తా॥ దైవమందిరమును ప్రతిరోజు ఎవరు తులసీదళములతో కూడిన నీటి చుక్కలతో కడుదుదురో వారికి సర్వపాపములును తొలగిపోవుననుట నిశ్చయము.

**శ్లో॥ న తస్య నరకే క్లేశో, యేஉర్చ యే త్తులసీదళైః ।**
**పాపిష్ఠోవా హ్యపాపిష్ఠ స్సత్యం సత్యం న సంశయః ॥**

**(అగస్త్య సంహిత)**

తా॥ ఎంత పాపియైనను, పాపి కాకున్నను, తులసీదళములతో శ్రీహరిని ఎవడు పూజించునో వాడు నరకమునందు కష్టములను పొందడు. ఈ మాట ముమ్మాటికి నిజము. ఇందులో ఎట్టి అనుమానమునకు తావు లేదు.

### బి) తులసికి గల శత్రువినాశనశక్తి

**శ్లో॥ పురా క్రౌంచ వధార్థాయ, కోమలై స్తులసీ దళైః**
**అర్చయిత్వా హృషీకేశం స్వామినా నిహతో రిపుః ॥**

**(అగస్త్య సంహిత)**

తా॥ పూర్వము క్రౌంచాసురుని వధింపగోరి, శ్రీసుబ్రహ్మణ్యస్వామి కోమలము లైన తులసీదళములతో శ్రీమహావిష్ణువును అర్చించి, తత్ఫలముగనే క్రౌంచాసురుని చంపగలిగెనని అగస్త్య సంహిత పేర్కొనినది.

### సి) తులసికి గల సర్వసంపత్ప్రదానశక్తి

**శ్లో॥ మాల్యాని తనుతే లక్ష్మీం కుసుమాంతరితాన్యపి**
**తులస్యాః స్వయ మానీయ నిర్మితాని తపోధన ॥**

**(స్కాందపురాణము)**

తా॥ ఓ తపోధనుడా! ఎన్ని పువ్వులతో ఎన్ని దండలతో శ్రీ విష్ణువును అర్చించినను, స్వయముగా తులసీదళములతో తయారు చేయబడిన మాలలను భగవంతునకు సమర్పించినచో ఆ పూజ సర్వసంపదలను కలిగించునని స్కాంద పురాణము వెల్లడించుచున్నది.

### డి) తులసికి గల పుణ్యప్రదానశక్తి

**శ్లో॥ కృష్ణమూర్ధని విన్యస్తా, తులసీపత్రమంజరీ ।**
**సువర్ణకోటి పుణ్యానాం ఫలం యచ్ఛ త్యతోధికమ్॥**

తా॥ ఒక్క తులసీదళమును కాని, మంజరిని కాని శ్రీకృష్ణుని తలపై ఉంచినచో, అది కోటి బంగారు నాణెములను దానము చేసిన దానికంటె అధిక పుణ్య ఫలమును ఇచ్చును.

**శ్లో॥ తీర్థయాత్రాభి రిహైవ కాలక్షేపేణం కిం జనైః ।**
**యేఽ ర్చయంతి హరే ర్బింబం తులసీదళకోమలైః ॥**

**(స్కాందపురాణము)**

తా॥ శ్రీమహావిష్ణువుయొక్క విగ్రహమును కోమలములైన తులసీదళములతో ఏ జనులు అర్చింతురో, వారు అనవసరముగా తీర్థయాత్రలు చేయుచు కాలమును, ధనము వ్యర్థము చేసి ఏమి ఫలము నందుదురు? అనగా తులసీదళములతో భగవంతునకు చేసిన సేవ సర్వతీర్థయాత్రలవలన కలుగు ఫలితము నిచ్చునని దీని భావము.

### ఇ) తులసికి గల సర్వార్థసాధనశక్తి

**శ్లో॥ పత్రం, పుష్పం, ఫలంచైవ శ్రీతులస్యాః సమర్పితమ్**
**రామాయ ముక్తి మార్గస్య ద్యోతకం సర్వసిద్ధిదమ్ ॥**

**(అగస్త్య సంహిత)**



తా॥ భక్తితో ఎవడు తులసియొక్క పత్రమునుగాని, పుష్పమును గాని ఫలమును (వెన్ను) గాని రామునకు సమర్పించునో, వానికి ముక్తిమార్గము కన పడుటయే గాక, సర్వార్థములును సిద్ధించును.

### ఎఫ్) తులసికి గల మోక్షప్రదానశక్తి

**శ్లో॥ తులసీమంజరీభి ర్యః కుర్యా ద్ధరిహరార్చనమ్ ।**
**న స గర్భగృహం యాతి ముక్తిభాగీ భవే న్నరః ॥**

**(పద్మపురాణము)**

తా॥ తులసీమంజరిని గ్రహించి ఎవడు హరినిగాని, హరునిగాని అర్చించునో, అతడు తిరిగి మాతృగర్భ మను గృహములోనికి ప్రవేశింపడు. దేహాంతరమున ముక్తిని తప్పక పొందగలడు.

**శ్లో॥ తులసీపత్ర మాదాయ యః కరోతి మమార్చనమ్ ।**
**న పున ర్యోని మాయాతి ముక్తిభాగీ భవే న్నరః ॥**

**(గరుడపురాణము)**

తా॥ తులసీపత్రమును తీసికొని ఎవడు నన్ను అర్చించునో తిరిగి వాడు ఈ లోకమున పుట్టడు, మోక్షమునే పొందును.

### జి) తులసికి గల వైకుంఠ లోకమునకు చేర్చు శక్తి

**శ్లో॥ తులసీ కృష్ణ గౌరాభా, తయాఽ భ్యర్చ్య జనార్దనమ్ ।**
**నరో యాతి తనుం త్యక్త్వా వైష్ణవీం శాశ్వతాం గతిమ్ ॥**

**(పద్మపురాణము)**

తా॥ కృష్ణతులసీదళములతోకాని, శుక్లతులసీదళములతో గాని ఎవడు జనార్దనుని భక్తితో అర్చించునో, అట్టి మానవుడు ఈ శరీరమును విడిచి, శాశ్వత గతియగు విష్ణులోకమును చేరును.

**శ్లో॥ కృష్ణం కృష్ణ తులస్యాహి యో భక్త్యా పూజయే న్నరః**
**న యాతి భువనం శుభ్రం యత్ర విష్ణుః శ్రియా సహ ॥**

**(విష్ణురహస్యము)**

తా॥ ఎవడు భక్తితో కృష్ణతులసీదళములతో శ్రీకృష్ణుని పూజించునో అతడు శ్రీ మహాలక్ష్మితో కూడిన, విష్ణుమూర్తి నివసించు పవిత్రమైన విష్ణులోకమును చేరును.

### హెచ్) భగవంతునకు ప్రీతిని కలిగించు శక్తి తులసికి గలదు

**శ్లో॥ తులసీదళగంధేన, మాలతీ కుసుమేన చ ।**
**కపిలాక్షీరదానేన సత్యం తుష్యతి కేశవః ॥**

**(బ్రహ్మాండపురాణము)**

తా॥ తులసీదళమును, మాలతీకుసుమమును నల్ల ఆవుపాలను, కేశవునకు సమర్పించుట వలన అతడు తప్పక సంతోషపడును.

**శ్లో॥ పత్రం, పుష్పం, ఫలం, తోయం తులసీగంధవాసితమ్**
**ఫలం, లక్షగుణం, ప్రోక్తం కేశవాయ నివేదితమ్ ॥**

**(స్కాందపురాణము)**

తా॥ తులసీగంధముతో పరిమళించునట్టి పత్రమును కాని, పుష్పమును కాని, ఫలమునుగాని, జలమును గాని కేశవునకు నివేదింపబడినప్పుడు ఇతర ద్రవ్యములను నివేదించినప్పటికంటె లక్షరెట్లు ఫలితము అధికముగా వచ్చును.

**శ్లో॥ తులసీగంధ మిశ్రంతు యత్ కించిత్ కురుతే హరేః ।**
**కల్పకోటి సహస్రాణి ప్రీతో భవతి కేశవః॥**

**(స్కాందపురాణము)**

తా॥ తులసీ గంధముతో కలిపి విష్ణువునకు ఏ పదార్థమును సమర్పించినను దానివలన కేశవుడు కల్పకోటి సహస్రముల కాలముపాటు సంతుష్టుడగుచునే యుండును.

తులసికిగల ఇన్ని శక్తులను, ఇంతటి మాహాత్మ్యమును గమనించిన తరువాత దానిని పూజింపవలెను అను సంకల్పము కలుగును. కనుక ఇక తులసీపూజా విధానము తెలిసికొందము.

అసత్యమునకు లోబడక నడచుటయే సత్యం. అది ఎప్పుడు అబద్ధమాడదు. క్రోధమునకు లోబడక నడచుటయే శాంతం. అది ఎన్నడును కోపించజాలదు. అన్ని ప్రాణులను తన ప్రాణంతో సమానంగా చూచి కాపాడుటయే దయ. అది ఎన్నడును క్రూరత్వంచూపదు. లోభమునకు లోబడక నడచునదే ధర్మం. అది ఎన్నడును దాచుకొనదు.

**శ్రీ భగవాన్ రమణమహర్షి**

జీవుడును సచ్చిదానంద స్వరూపుడే. ఈ మాయలేక అహంకారము ద్వారా నిజ స్వరూపమును మరచిపోవును. జ్ఞానము కల్గినచో అహంకారము నశించును.

కామినీ–కాంచనములలోనే లిప్తమైనట్టి అహంబుద్ధి చాల నీచమైనది, పరమాత్మను జీవుని వేరుపరచుచున్నట్టిది ఈ అహంకారమే సుమా! ఒకే జలరాశి–దానిలో ఒక కఱ్ఱ అడ్డముగ పెట్టినచో రెండు భాగములుగ కనుపించును. ఆ కఱ్ఱ తీసివేసినచో ఒకే జలరాశి. జీవాత్మ పరమాత్మలు రెండు భాగములుగ కనుపించును. అట్లే "అహం" అనెడి కఱ్ఱను తీసివేసినచో ఒకే పరమాత్మ?"

**శ్రీరామకృష్ణ పరమహంస**



# FORM-IV

(SEE RULE-8)

| | | |
|---|---|---|
| 1. | Name of the Magazine | : Santi (Telugu Language) |
| 2. | Place of Publication | : The Mission of Peace Sri Santi Ashram, Via Sankhavaram, Thotapalli, Kakinada Dist - 533433, A.P. |
| 3. | Periodicity of the Publication | : Monthly |
| 4. | Printer's name and address | : Partner's : Sri G.V. Rao and Sri G.V. Madhu Mohan, Mohan Graphics, D.No. 12-1-40, Jawarhar Street, Kakinada-533 001, Kakinada Dist , A.P. |
| | Whether Citizen of India | : Yes |
| | (If Foreigner, State the Country of Origin) | : Not Applicable |
| 5. | Publisher's Name | : M.V.V. Satyanarayana |
| | Whether Citizen of India | : Yes |
| 6. | Editor's Name | : Swamini Vinamrananda |
| 7. | Address | : The Mission of Peace, Sri Santi Ashram, Via Sankhavaram, Thotapalli, Kakinada Dist - 533 446, A.P. |
| 8. | Name and address of Individuals who own the Sri papere and more than one percent of the total capital | : The Board of Trustees and the Committee of Management of Santi Ashram, (Regd). Sri Santi Anshram Post, Via Sankhavaram, Kakinada Dist., A.P. - 533 446 |

I, Publisher, Sri Santi Ashram, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

**M.V.V.Satyanarayana**
Publisher
The Mission of Peace,
Sri Santi Ashram

## దాతలకు విజ్ఞప్తి

దివ్యాత్మ స్వరూపులకు సూచన. శ్రీ శాంతి ఆశ్రమమునకు విరాళము ధన రూపంలో / చెక్కు / ఎస్.బి.ఐ. కత్తిపూడి, అకౌంట్ నెం. 11003309435 కు IFSC Code : SBIN0014774 ఆన్‌లైన్ ద్వారా పంపగలరు. మీ విరాళములకు ఇన్‌కమ్‌ట్యాక్స్ 80జి రాయితీ కలదు. మీరు ఏ విధంగా విరాళము పంపినను వ్రాత పూర్వకంగా లేదా ఇమైయిల్ ద్వారా మొబైల్ నంబరు 7382009962 మరియు రిసెప్షన్ నెంబరు 917815890094కు మీ పేరు, చిరునామా మీ మొబైల్ నంబరు తెలుపగలరు.

## శాంతి పత్రిక చందాదారులకు విజ్ఞప్తి

శాంతి పత్రిక ప్రతినెలా 1,2 & 3 తేదీలలో పోస్టు చేయబడును.

సం॥ర చందా రూ.100/-, జీవిత చందా రూ.1000/- (12 సంవత్సరముల వరకు మాత్రమే), ఎమ్.ఓ/స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కత్తిపూడి అకౌంట్ నెం.11003309435, ఆన్‌లైన్ ద్వారా ఈ క్రింది చిరునామాకు పంపగలరు.

ఎమ్.ఓ.ఫారమ్‌లో దిగువ ఫర్ కమ్యూనికేషన్ భాగములో మీ పూర్తి చిరునామా వ్రాయాలి. తదుపరి క్రొత్త చందా లేక పాత చందా అనునది క్లుప్తముగా వ్రాయాలి. పాత చందా అయితే చందాదారు సంఖ్య వ్రాయాలి.

చందాకాలం ముగింపుకు నెలముందే రెన్యువల్ చేసుకొనవలెను. మీ అడ్రస్ మార్పు జరిగితే, ఉత్తరము ద్వారా తెలుపుతూ చందా నెంబరు వ్రాయాలి. చందా వివరములు తెలుపని యెడల సొమ్ము విరాళముగా జమచేయబడును.

కార్యదర్శి, శ్రీ శాంతి ఆశ్రమం (పోస్ట్)
వయా శంఖవరం - 533 446, తూ.గో.జిల్లా

## కార్యక్రమములు - మాతృ ఆశ్రమం

**తేది 23-4-2023 (ఆదివారం) :** అక్షయతృతీయ సందర్భంగా ఉ॥గం.7.30ని॥లకు శ్రీలక్ష్మీనరసింహస్వామి శతనామార్చన (ప్రార్థనా మందిరము)

**తేది 25-4-2023 (మంగళవారం) :** 'శంకర జయంతి' సందర్భంగా ఉ.గం.7.30ని॥లకు శ్రీ శంకర అష్టోత్తర శత నామార్చన.

## వార్తలు - మాతృ ఆశ్రమం

**1. ది. 18-2-2023 (శనివారం) :** శివరాత్రి సందర్భంగా ఏకాదశ రుద్రాభిషేకములు, సహస్రలింగార్చన, లక్ష బిల్వార్చన అన్నవరం దేవస్థాన వేద పండితులచే జరుపబడినది.



**2. ది. 18-2-2023 (శనివారం) :** శివరాత్రి సందర్భంగా రుద్రహోమములు, ఏకాదశ రుద్రాభిషేకము, బిల్వపత్ర పూజ ఆశ్రమవాసులు, ఆశ్రమ భక్తులచే జరుపబడినది.

**3. ది. 3-3-2023 (శుక్రవారం) నుండి 11-3-23 (శనివారం) వరకు :** స్వామి సత్యాత్మానంద చిన్మయా మిషన్, (ఒంగోలు), స్వామి పరమాత్మానంద, (శ్రీకాకుళం) వారి ఆధ్వర్యమున రామాయణ నవాహ్నికము జరిగినది. ఈ శ్రీ వాల్మీకి రామాయణ పారాయణములో తొమ్మండుగురు ఒంగోలు భక్తులు, విశాఖ శాఖ భక్తులు మరియు మాతృ ఆశ్రమ భక్తులు పాల్గొనిరి. పారాయణ సమాప్తానంతరము శ్రీ సీతారామ కల్యాణము శరభవరం పురోహితులచే జరిగినది.

**ది. 30-03-2023 (గురువారం) :** శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవము ఆనందోత్సాహంతో జరుపబడినది. పిదప ప్రసాద వితరణ జరుపబడినది.

## వార్తలు - కాకినాడ శాఖ

**1. ది. 10-2-2023 :** ప్రతినెల వృద్ధులకు బియ్యము, పప్పు వితరణ జరుగుచున్నది.

**2. ది.18-2-2023 :** శివరాత్రి సందర్భముగా రుద్రాభిషేకములు, బిల్వపత్ర పూజ జరుపబడినది.

**3. ది.23-2-2023 నుండి 25-2-2023 :** శ్రీరామచంద్రమిషన్ యోగ శిక్షణా శిబిరము నిర్వహించగా 100 మంది భక్తులు పాల్గొన్నారు.

**4. ది. 22-3-2023 :** ఉగాది సందర్భంగా పూజా కార్యక్రమములు నిర్వహించారు.

**5. ది. 30-3-2023 :** శ్రీరామనవమి సందర్భంగా శ్రీ సీతారామకళ్యాణం, ప్రసాద వితరణ జరిగినది.

ఈ శాఖనందలి అన్ని పూజాకార్యక్రమములు కాకినాడ ఆశ్రమ శాఖ మహిళా సభ్యులు నిర్వహించిరి.

తృప్తిలేని వారికి మానసిక వ్యధ తప్పదు. అది తప్పవలెనన్నచో దైవమును శరణు వేడి కలిగినదానితో తృప్తి చెంది శాంతిగా జీవించవలెను.

**స్వామి ఓంకార్**

దైవమును పొందుటకు హృదయమాలిన్య ప్రక్షాళనను చేసి, దానిని శుభ్రముగా మార్చుకొని హరినామస్మరణ మాధుర్యముతో నింపినచో అచ్చట భగవంతుడు ప్రతిష్ఠితుడు అగును. అచ్చట అంతయు శాంతిమయమే.

**స్వామి ఓంకార్**

# విరాళములు

18. శ్రీమతి విజయలక్ష్మి గారు 5,116/-
19. ఒక భక్తుడు 5,000/-
20. శ్రీ ఇషాజి (హైదరాబాదు) 20,000/-
శాశ్వత విద్యాపథకం నిమిత్తం
21. శ్రీమతి గీతిక గారు (హైదరాబాదు) 10,000/-
శాశ్వత విద్యాపథకం నిమిత్తం
22. శ్రీ నిర్వాణ్ (హైదరాబాదు), శాశ్వత విద్యాపథకం నిమిత్తం 20,000/-
23. శ్రీ టి. వెంకటేశ్వర్రావు గారు (హైదరాబాదు) 70,000/-
విద్యార్థుల యూనిఫాం నిమిత్తం
మరియు విద్యాఖర్చుల నిమిత్తం
24. శ్రీ కుసుమంచి రామేశ్వర్రావు గారు (తుని) 10,000/-
శాశ్వత విద్యాపథకం నిమిత్తం
25. శ్రీమతి కముజు అనంతలక్ష్మి గారు (శాంతి ఆశ్రమం) 50,000/-
గోదానం నిమిత్తం
26. శ్రీ స్వామి శిద్దానంద్ గారు (శాంతి ఆశ్రమం) 12,001/-
గోగ్రాసం నిమిత్తం
27. శ్రీమతి గొర్రిపాటి మహేశ్వరి గారు (విజ్జినగిరి) 5,000/-
28. శ్రీమతి ఈమని శేషారత్తం గారు (హైదరాబాదు) 20,000/-
వీరి చెల్లెలు శ్రీమతి మున్నంగి వరలక్ష్మి గారి జ్ఞాపకార్థం
అన్నదానం మరియు గోగ్రాసం నిమిత్తం
29. శ్రీ కె.ఆర్. గురుబాలన్ గారు (ఆనందాశ్రమం) 15,000/-
30. డా॥ విమలా అయ్యర్ గారు (ఆనందాశ్రమం) 30,000/-
31. డా॥ కృష్ణరాం భరతుల గారు (న్యూఢిల్లీ) 20,000/-
సోలార్ ఫెన్సింగ్ నిమిత్తం
32. శ్రీ పి.వి. ప్రభాకరరావు గారు (హైదరాబాద్) 5,000/-
33. శ్రీమతి భారతి సుబ్రహ్మణ్యం గారు (హైదరాబాద్) 5,000/-
గోగ్రాసం నిమిత్తం
34. సత్యసాయి ఇండస్ట్రీస్ లిమిటెడ్ (విశాఖపట్నం) 1,00,000/-
శాశ్వత విద్యాపథకం నిమిత్తం
35. శ్రీ సుర్ సోమాజీ గారు (హైదరాబాదు) 2,00,000/-
శాశ్వత విద్యాపథకం నిమిత్తం
36. శ్రీ ఎస్.ఎల్. నరశింహరావు గారు (హైదరాబాదు) 1,00,000/-



శాశ్వత విద్యాపథకం నిమిత్తం
37. శ్రీమతి ఎస్. శాంతగారు (సికింద్రాబాదు) 30,000/-
38. శ్రీ ఎమ్. కృష్ణయ్య చౌదరి గారు (శాంతి ఆశ్రమం) 50,000/-
గోగ్రాసం నిమిత్తం
39. శ్రీ పి.హెచ్.కె. శర్మగారు (శాంతి ఆశ్రమం) 10,000/-
40. శ్రీ వెదురుపాక గిరీష్ కుమార్ గారు (పిఠాపురం) 10,000/-
41. శ్రీ తంగిరాల తిరుమల ప్రకాష్ నాగేంద్రనాథ్ గారు (తణుకు) 12,500/-
గోగ్రాసం నిమిత్తం
42. శ్రీమతి కుమారి కంచన రాధిక గారు (హైదరాబాదు) 3,000/-
43. శ్రీ పి.హెచ్.కె. శర్మగారు (శాంతి ఆశ్రమం) 21,000/-
కృష్ణమందిరం నిమిత్తం
44. శ్రీ గైనీడి శ్రీనివాస్ గారు (హైదరాబాదు) 1,00,000/-
విద్యా ఖర్చుల నిమిత్తం వీరి తల్లిగారు జి. సులోచన గారి
పుట్టినరోజు సందర్భముగా
45. శ్రీ రామచంద్ర మిషన్ (కాకినాడ) 5,000/-
46. శ్రీమతి దాసరి శేషారత్నం గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
పూజ్య మాతాజీ జన్మదినము సందర్భముగా
47. శ్రీ సుబ్రమణియన్ గారు & శ్రీరాం సుబ్రమణియన్ గారు 1,00,000/-
(ఆనందాశ్రమం)
48. శ్రీ జి. రామకృష్ణ రాజు గారు (విశాఖపట్నం) 1,00,000/-
గోగ్రాసం నిమిత్తం
49. శ్రీ బి. అభిషేక్ గారు (విశాఖపట్నం) 5,000/-
పూజ్య ఓంకార స్వామీజీ పుట్టినరోజు సందర్భముగా
50. శ్రీ పి. సాయిబాబా గారు (హైదరాబాదు) 6,000/-
స్వామీ ఓంకార్‌జీ పుట్టినరోజు సందర్భముగా
51. శ్రీ కృపేష్ ఎ.కె. గారు (ఆనందాశ్రమం) 49,000/-
52. శ్రీ అతుల్య కె. గారు (ఆనందాశ్రమం) 49,000/-
53. శ్రీ ఆజేష్ కుమార్ కె. గారు (ఆనందాశ్రమం) 48,000/-
54. శ్రీ చంద్ర కేశవన్ గారు (ఆనందాశ్రమం) 49,000/-
55. శ్రీ సుందర్ శ్రీవత్సగారు (ఆనందాశ్రమం) 15,000/-
56. శ్రీ ఎమ్.కృష్ణయ్య చౌదరి గారు (శాంతి ఆశ్రమం) 10,000/-
57. డా॥ పైడా శ్రీరామకృష్ణయ్య గారు (కాకినాడ) 5,000/-
స్వామీ ఓంకార్‌జీ పుట్టినరోజు సందర్భముగా

# 1-వెలకట్టలేనిది?

(పూజ్యగురుదేవ్ స్వామీ చిన్మయానందగారు, పూజ్య మాతాజీ స్వామినీ శారదాప్రియానందగారు ఆంగ్లములో బాలలకోసం రచించిన 'తరంగిణి' అనే 11 పుస్తకముల స్రవంతిలో, 2వ పుస్తకాన్ని, విశ్రాంత ఆంగ్ల అధ్యాపకులు శ్రీ బొల్లినేని కోటేశ్వరరావు గారి అనువాదముతో మీకు అందిస్తున్నాము)

ఒకప్పుడు ఓ నగర శివార్లలో ఓ మహాత్ముడుండేవాడు. ఆయన దగ్గర నమ్మకంగా పనిచేసే ఓ సేవకుడున్నాడు. ఓ రోజు ఆ సేవకుడు ఆ మహాత్ముని సమీపించి, తనకు మంత్రోపదేశం చేయమని అభ్యర్థించాడు. అతని సేవకు సంతసించిన ఆ మహాత్ముడు, అతనికి ఓ శుభ ఘడియలో మంత్రోపదేశం చేశాడు. ఆయన శిష్యుని చెవిలో నెమ్మదిగా మంత్రం చెప్పి, తరువాత ఆ మంత్రం చాలా రహస్యమనీ, దానిని ఎవ్వరికీ చెప్పద్దనీ, శిష్యుని ఆదేశించాడు. ఆ ప్రకారమే ఆ శిష్యుడు, తన ప్రక్కనున్న మనిషికి కూడా వినబడనంత చిన్నగా మంత్రజపం చేసుకునేవాడు.

ఒకరోజు ఆ సేవకుడు అక్కడికి సమీపంలోని నదిలో స్నానం ముగించుకుని, ఒడ్డునున్న చెట్టుక్రింద కూర్చుని, గురువుగారు ఇచ్చిన మంత్రాన్ని చాలాసేపు నిశ్శబ్దంగా జపించాడు. ఆ సమయంలో అక్కడికి చాలామంది భక్తులు వచ్చి, ఆ నదిలో స్నానం చేస్తూ బిగ్గరగా రామనామాన్ని ఉచ్చరిస్తున్నారు. ఈ శిష్యుడు అది విని ఆశ్చర్య పోయాడు. తన గురువు తనకు ఉపదేశించిన మంత్రమూ రామనామమే. మరి ఆయన దానిని ఎందుకు గోప్యంగా ఉంచమన్నారు? వీరేమో పెద్దగా అంటున్నారు కదా? ఈ ఆలోచనతో, అతనికి ఏకాగ్రత చెదరి, నేరుగా గురువు దగ్గరకు వెళ్ళి, “గురువర్యా, మీరు నాకు మంత్రోపదేశం చేసి, అది చాలా రహస్యమని చెప్పారు కదా. కానీ ఈరోజు నదీస్నానం చేస్తున్న చాలామంది అదే మంత్రాన్ని ఎంతో బిగ్గరగా జపిస్తున్నారు. మరి ఆ మంత్రం రహస్యమని నాకు ఎందుకు చెప్పారు?” అని అడిగాడు.

గురువు నవ్వి, తన పెట్టెలోనుండి మెరుస్తున్న ఒక రాయిని తీసి శిష్యునికి ఇచ్చి, “దీనిని నగరానికి తీసుకువెళ్ళు, రకరకాల వ్యక్తులకు చూపించు. వారు దీనిని ఎంతకు కొంటారో వాకబు చెయ్. కాని దీనిని ఎవ్వరికీ అమ్మవద్దు. వారు ఇవ్వజూపిన ధరను మాత్రం తెలుసుకుని, మళ్ళీ వెనుకకు జాగ్రత్తగా తీసుకు రా,” అన్నాడు.

ఆ శిష్యుడు మెరుస్తున్న ఆ రాయి తీసుకుని, బజారుకు బయలుదేరాడు. త్రోవలో ఓ కూరగాయల వ్యాపారిని చూసి, అతనికి ఈ రాతిని చూపుతూ, “ఎంతకు కొంటావ్?” అని అడిగాడు. ఆ వ్యాపారి దానిని అటు ఇటు త్రిప్పిచూసి, “ఇదేమీ



పెద్దగా ఉపయోగపడే వస్తువేమీ కాదు. అప్పుడప్పుడూ నాకు కూరగాయల తూకానికి ఉపయోగపడుతుంది. కావాలంటే ఒక సేరు వంకాయలిస్తాను.” అన్నాడు. శిష్యుడు ఆ వ్యాపారికి కృతజ్ఞతలు తెలిపి, ఆ రాయిని తీసుకుని, ముందుకు సాగాడు.

తరువాత అతను ఓ కట్టెలు అమ్మేవానికి ఆ రాయిని చూపించి, “ఎంతకు కొంటావ్?” అని అడిగాడు. అతను దానిని జాగ్రత్తగా పరిశీలించి, బాగా మెరుస్తున్నదనీ, తన కుమారునికి ఆట వస్తువుగా పనికి వస్తుందని, తాను దానికి ఎనిమిది మణుగుల కట్టెలిస్తానని అన్నాడు. శిష్యుడు ఆ రాతిని తిరిగి తీసుకుని, బజారుకు చేరుకున్నాడు.

అలా ఓ బియ్యపు వ్యాపారికి ఆ రాతిని చూపించాడు. అది నకిలీ వజ్రంలా ఉన్నదని అతనన్నాడు. ఏమైనా దానిని కంఠహారంలో ఉపయోగించువచ్చు గనుక తాను దానికి ఓ బియ్యపు ఒస్తా ఇస్తానన్నాడు. శిష్యుడు మళ్ళీ ఆ రాతిని వెనక్కు తీసుకుని, ముందుకు సాగాడు.

ఈ పాటికి ఆ శిష్యునికి నిజంగా ఆ రాయి విలువ ఎంత ఉంటుందా? అనే కుతూహలం పెరిగే ఉంటుంది. అతను బంగారు పనివాని దగ్గరకు వెళ్ళి, ఆ రాయిని చూపించాడు. అతడు దానిని సూక్ష్మంగా పరిశీలించి, దానికో వెయ్యి రూపాయలిస్తానన్నాడు. దానికి ఆశ్చర్యపడిన శిష్యుడు అక్కడినుండి ఓ వజ్రాల వ్యాపారి వద్దకు వెళ్ళాడు. అతడు దానిని చూచిన వెంటనే ఆశ్చర్యంతో, “ఈ వెలకట్టలేని వజ్రం నీకెక్కడ దొరికింది? నా ఆస్తినంతా అమ్మినా నేను దీనిని కొనలేను. మన పట్టణంలో ఎవ్వరూ దీనికి విలువనే కట్టలేరు. నీవు తొందరపడి దీనిని ఈ చిన్న ఊరిలో అమ్మవద్దు. పెద్ద నగరానికి వెళ్ళు, అక్కడ నీకు దీనికి నిజమైన ఖరీదు దక్కవచ్చు,” అన్నాడు.

ఎంత అద్భుతం! ఈ రాయి విలువ మనిషి, మనిషికి మారిపోతోంది! ఆ శిష్యుడు, ఆ వ్యాపారికి కృతజ్ఞతలు తెలిపి, ఆ రాయిని తిరిగి తీసుకుని తన గురువు వద్దకు వచ్చాడు. దానికి ఎవరెవరు ఎంతెంత ఇస్తామన్నది అంతా తన గురువు తెలిపాడు.

ఆ గురువు తలాడించి శిష్యునితో, “రామనామ విషయం కూడా ఇంతే, అందరికీ రామనామం తెలిసిఉండవచ్చు, కానీ నిజమైన విలువ తెలిసినవారెవరు? ఈ రాయి విలువని ఆ వజ్రాల వ్యాపారి గుర్తించినట్లు, నిజమైన సాధకుడు నిరంతర ధ్యానంతో మాత్రమే రామనామ విలువను తెలుసుకోగలడు. మిగతా వారికి ఆ నామ మహిమ తెలియదు,” అన్నాడు.

రామనామం రహస్యమని, తన గురువు ఎందుకు చెప్పాడో ఇప్పుడు శిష్యునికి అర్థమైంది. అప్పటి నుండి తను భక్తి, విశ్వాసాలతో, కృషిచేసి జ్ఞానోదయం పొందాడు.

# శ్రీ శాంతి ఆశ్రమ ప్రచురణలు

| | |
|---|---|
| 1. శాంతి ప్రదాత శ్రీ స్వామి ఓంకార్ ఆత్మకథ | 100/- |
| 2. ఓంకార సద్భోధామృతము | 70/- |
| 3. సోహం | 10/- |
| 4. ఓం జపం | 10/- |
| 5. మౌనపు ఘడియలు | 30/- |
| 6. ప్రేమయే దైవము | 10/- |
| 7. భగత్సాక్షాత్కారము ఇప్పుడు ఇక్కడే | 10/- |
| 8. శాంతి దళములు | 10/- |
| 9. ఆధ్యాత్మిక మెరుపులు | 10/- |
| 10. సత్సంగ సందేశములు | 30/- |
| 11. ఓంకార సూక్తులు | 10/- |
| 12. ఓంకార స్తోత్ర కదంబం | 10/- |
| 13. శాంతి సూక్తులు | 10/- |
| 14. శాంతి ప్రార్థన | 20/- |
| 15. శ్రీ శాంతి స్తోత్రమాల | 30/- |
| 16. స్వామి ఓంకార్ ఆత్మదర్శిని | 20/- |
| 17. సందేశ తరంగిణి | 40/- |
| 18. నా చెల్లి పునర్జన్మ | 10/- |
| 19. నేను ఆంగ్లభాష ఎలా నేర్చుకొన్నాను. | 20/- |
| 20. శ్రీశ్రీశ్రీ ఓంకార స్వామి స్తోత్రము | 20/- |
| 21. శాంతి దూత స్వామి ఓంకార్ | 30/- |
| 22. స్వామి ఓంకార్ జీవిత విశేషాలు | 10/- |
| 23. శ్రీ శాంతి ఆశ్రమ చరిత్ర (1917-2020) | 100/- |
| 24. ధ్యానము | 30/- |
| 25. పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీ వారి దివ్య సందేశములు దేశ విదేశీయ పర్యటనలు | 50/- |
| 26. ప్రార్థనలు - ధ్యానములు | 20/- |
| 27. విశ్వ ప్రార్థన | 20/- |
| 28. శ్రీ శాంతి ఆశ్రమం శతాబ్ది సంచిక | 120/- |
| 29. నిత్య సందేశములు | 20/- |
| 30. ఆంతర్య భావనలు | 20/- |
| 31. శ్రీ ఓంకార బోధామృతం | 20/- |
| 32. నాల్గు దశలలో ఉపదేశము | 10/- |
| 33. శాంతి ప్రార్థన - స్వామి ఓంకార్ | 20/- |

This Periodical is Registered with Registar of Newspapers, New Delhi Vide R.No. 3447/57,
Dt. 18-12-20 Permitted to Post Under Concessional Postage Vide AP/KD-24/2021-2023

## SRI SANTI ASHRAM ENGLISH PUBLICATIONS

| | |
|---|---|
| 1. Auto Biography of swami Omkar (2 Volumes) | Rs. 150/- |
| 2. Life and Teachings of Swami Omkar | Rs. 10/- |
| 3. Soham | Rs. 10/- |
| 4. Cosmic Fast | Rs. 20/- |
| 5. Meditation | Rs. 10/- |
| 6. Om Japa | Rs. 10/- |
| 7. Control of Mind | Rs. 30/- |
| 8. Cosmic Flashes | Rs. 10/- |
| 9. In the Hours of Silence | Rs. 10/- |
| 10. The Soul of Omkar | Rs. 10/- |
| 11. How I learned English | Rs. 10/- |
| 12. Reincarnation of my Little Sister | Rs. 10/- |
| 13. God Realization Now and Here | Rs. 10/- |
| 14. Mystic Prayers and Poems | Rs. 20/- |
| 15. The Divine Voice of Omkar | Rs. 40/- |
| 16. Auto Biography of Omkar (Revised Edition) | Rs. 100/- |
| 17. Petals of Peace | Rs. 20/- |
| 18. The Story of my life and Work | Rs. 10/- |
| 19. Priceless legacy of Swami Omkar | Rs. 10/- |
| 20. The Four Initiations | Rs. 10/- |
| 21. Musings | Rs. 20/- |
| 22. Peace Prayer | Rs. 20/- |

THE MISSION OF PEACE
శ్రీ శాంతి ఆశ్రమము
పోస్టు: శాంతి ఆశ్రమము
(వయా) శంఖవరం - 533 446
తూ॥గో॥జిల్లా, (ఆం.ప్ర.)
ఫోన్ : 7382009962
email: srisanthiashram@gmail.com
www: www.srisantiashram.org

Book Post

Printed by Mohan Graphics and Published by MVV Satyanarayana on behalf of The Mission of Peace - Sri Santi Ashram and printed at Mohan Graphics, Kakinada - 533 001. Ph:0884-2361419 and Published at Thotapalli Hills-533 446, Ph: 73820 09962 Editor : Swamini Vinamrananda